
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 13.12.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 4




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



- తల్లీ, కొడుకుల పార్టీకి తల తిరిగింది
- ఎన్నికల్లో ఘోర పరాభవం
- కోలుకోక ముందే సొంత ఎంపీల అవిశ్వాసతీర్మానం
- దేశ చరిత్రలోనే కాంగ్రెస్‌కు తీరని అవమానం

# పరువుపోయింది

**కాంగ్రెస్‌పార్టీ ఒక రాజకీయ సంస్థ. దానికి ప్రాణం ఉండదు, స్పందన ఉండదు. ఆత్మాభిమానం ఉండదు. కాబట్టే ఇప్పటి పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. అదే స్పందించే గుణం, ప్రాణం అనేది ఉంటే ఇప్పుడు జరిగిన అవమానాలకు టెన్‌జనపథ్ ముందున్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండేదేమో!**

దేశ చరిత్రలోనే ఏ రాజకీయపార్టీకీ ఎదురుకాని అవమానం కాంగ్రెస్‌కు ఎదురయ్యింది. సొంతపార్టీ ఎంపీలే తమ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన అపూర్వఘట్టం ఇప్పుడు మాత్రమే చోటుచేసుకుంది. అలా సొంతపార్టీ ఎంపీల విశ్వాసాన్నే కోల్పోయిన ఘనమైన హీనచరిత్రను కాంగ్రెస్‌పార్టీ తన ఖాతాలో జమచేసుకుంది. దేశ చరిత్రలో ఇంతటి అవమానం ఏ పార్టీకి జరిగి ఉండదు. ఇది కేవలం కాంగ్రెస్ అగ్రనేతల అహంకార ధోరణి ఫలితమే. మావల్లే భారత దేశంలో సూర్యుడు ఉదయిస్తున్నాడు. మా కుటుంబం పాలించబట్టే సకాలంలో వర్షాలొస్తున్నాయి... నదులు పారుతున్నాయి... పంటలు పండుతున్నాయి అన్నట్లుగా వ్యవహరిస్తున్న కుటుంబ పాలకుల వల్లే.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పరువు పాతాళానికి పడిపోయింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలలో ఆ పార్టీ చావుదెబ్బతింది. అక్కడొచ్చిన ఫలితాలు చూస్తే ఆ పార్టీ సిగ్గుతో చావాల్సిందే. చత్తీస్‌గఢ్‌లో సానుభూతి పనిచేయబట్టి కొంతవరకు మెరుగైంది. మిజోరాంలో మాత్రం ఏ చెట్టు లేనిచోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్లు మళ్ళీ నెగ్గింది. ఈ ఫలితాలు చూసి కూడా కాంగ్రెస్ అగ్రనేతలు బుద్ధి తెచ్చుకోవడం లేదు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతోనే సగం చచ్చిన కాంగ్రెస్‌కు ఆంధ్రప్రదేశ్‌లో సొంతపార్టీ ఎంపీలే ఆరుమంది అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడంతో గొంతులో వెలక్కాయపడ్డట్లయ్యింది. చరిత్రలో ఏ పార్టీకీ ఈ పరిస్థితి రాలేదు. అవిశ్వాస తీర్మానంతో ఇప్పటికిప్పుడు యూపీఏ ప్రభుత్వం పడిపోకపోవచ్చు. కాని సొంత ఎంపీలే అవిశ్వాసం పెట్టడం ఎంత నగుబాటుతనం.

ప్రజాస్వామ్యానికి పాతరేస్తూ, ఒక ప్రాంతం ప్రజలకు (మిగతా 3వ పేజీలో)

## సొంతపార్టీకి వేళాయరా?

### కాంగ్రెస్‌పై దూకుడు పెంచిన కిరణ్



**కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఎదిరించడం అంటే ఆషామాషీ కాదు. అధిష్ఠానాన్ని ప్రశ్నించడమంటే సోనియాగాంధీని వేలెత్తి చూపడమే! ఆమె వైపు వేలెత్తి చూపితే ఏమవుతుందనేదానికి గతంలోనే కొన్ని సాక్ష్యాలున్నాయి. ఎవరైనా తనను ప్రశ్నిస్తే సోనియాగాంధీ అహంకారం దెబ్బతింటుంది. అనలే అహంభావపు మనిషి. వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకోకుండా వదలదు.**

ఇంత తెలిసి కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేరుగా అధిష్ఠానంతోనే తలపడుతున్నాడు. రాష్ట్ర విభజనపై పదేపదే అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తున్నాడు. రాష్ట్ర విభజనను చాలా గట్టిగా వ్యతిరేకిస్తూ సోనియానే ఢీకొంటున్నాడు. కిరణ్ ఇలా తిరుగుబాటు చేయడం వెనుక కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహం వుందని కొందరంటున్నారు. కాని కిరణ్ మాటల్లో చేతల్లో అలాంటి కపటనాటకం కనిపించడం లేదు.

కాకపోతే కాంగ్రెస్ అధిష్ఠానంతో

(మిగతా 3వ పేజీలో)

## హీనుడిగా మారిన హీరో!

### చిరంజీవిపై పెరుగుతున్న వ్యతిరేకత



**రాజకీయాల్లో సాహసవంతుడినే అదృష్టలక్ష్మి వరిస్తుంది. సాహసం చేయకుంటే నిత్యదరిద్రుడిగా మిగిలిపోతాడు. పదవుల కోసం పాకులాడే వాళ్లు కాదు, ప్రజల కోసం పోరాడేవాళ్లే చరిత్రలో హీరోలుగా మిగిలిపోతారు.**

ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎవరు? ఈ దేశంలో ఎంతమందికి తెలుసు. ఆయన ఒక ఐఆర్‌ఎస్ అధికారి. సామాజిక ఉద్యమాల కోసం ఉద్యోగాన్నే వదులుకున్నాడు. ఆయన సినిమాహీరో కాదు... వంద సెంచరీలు చేసిన క్రికెట్ యోధుడు కాదు. మరి ఈరోజు దేశాన్నే కాదు ప్రపంచం దృష్టిని కూడా ఆకర్షించాడు. ఢిల్లీ ఎన్నికల్లో జాతీయపార్టీలకే చుక్కలు చూపించాడు. అంటే ఇక్కడ అరవింద్ కేజ్రీవాల్ సాహసమే ఆయనను హీరోగా నిలబెట్టింది.

కాని మన రాష్ట్రంలోనూ మనకొక హీరో వున్నాడు. ఆయనే మెగాస్టార్ చిరంజీవి. ఈ తెరమీద పులి టెన్‌జనపథ్ ముందు మాత్రం పిల్లిలా మారుతుంది. రాష్ట్ర విభజన

(మిగతా 3వ పేజీలో)



## అసెంబ్లీ వేదిక...

# రణరంగమే ఇక!

### టీ-బిల్లు వస్తే రచ్చరచ్చే

అసెంబ్లీలో ఇంతవరకు ఎమ్మెల్యేలు పార్టీల వారీగా తన్నుకున్నారు, ఆరోపణలు చేసుకున్నారు, విమర్శలు విసురుకున్నారు. ఇప్పుడు మాత్రం పార్టీలను పక్కపెట్టి ఎమ్మెల్యేలు ప్రాంతాలవారీగా విడిపోతున్నారు. సీమాంధ్ర ఎమ్మెల్యేలు జైసమైక్యాంధ్ర అంటుండగా, తెలంగాణ ఎమ్మెల్యేలు ప్రత్యేక తెలంగాణ నినాదంతో మోతెక్కిస్తున్నారు.

కేంద్ర కేబినెట్ ఆమోదించిన తెలంగాణ బిల్లును రాష్ట్రపతి పరిశీలించి రాష్ట్ర శాసనసభకు పంపారు. ఆరువారాలలోగా ఈ బిల్లును తిరిగి పంపాలని ఆయన గడువు నిర్దేశించారు. ఈ బిల్లుపై అసెంబ్లీలో ఓటింగ్ జరిగే అవకాశం లేకుండా చేసింది కేంద్రప్రభుత్వం. కేవలం ముసాయిదా బిల్లును పంపించి ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణకు మాత్రమే పరిమితం చేసింది. అయితే బిల్లుపై జరిగే చర్చ రచ్చకు దారితీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బిల్లును ఎలాగైనా గట్టెక్కించి తెలంగాణ కలను సాకారం చేసుకోవాలనే తొందరలో తెలంగాణ ఎమ్మెల్యేలున్నారు. ఈ బిల్లుకు ఎలాగైనా గండికొట్టి రాష్ట్ర విభజనను అడ్డుకోవాలనే కసితో సీమాంధ్ర ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో ఇరుప్రాంతాల ఎమ్మెల్యేల మధ్య వాడి వేడి చర్చలకు ఆస్కారముంది. చర్చలకంటే గొడవలే ఎక్కువగా జరగొచ్చు. ముఖ్యంగా సీమాంధ్ర ఎమ్మెల్యేలలో ఐక్యత లేదు. ఇది తెలంగాణ నేతలకు లాభించే అవకాశముంది.

ఈ నెల 12వ తేదీన రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దిగ్విజయ్‌సింగ్ హైదరాబాద్‌కు రావడం జరిగింది. రాష్ట్ర శాసనసభలో తెలంగాణ బిల్లును సజావుగా గట్టెక్కించేందుకు ఇరుప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఆయన మంతనాలు జరిపాడు. ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం సమైక్యాంధ్ర విషయంలో రాజీపడే ప్రశ్నే లేదని కేంద్రమే తెలంగాణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని తెగేసినట్లు చెప్పారు. దిగ్విజయ్‌సింగ్ కూడా తెలంగాణపై వెనక్కితగ్గేది లేదని తేల్చిచెప్పాడు. దిగ్విజయ్ రాక సందర్భంగా హైదరాబాద్‌లో ఉద్రిక్తతపరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవన్నీ కూడా తెలంగాణపై రేపు అసెంబ్లీలో వాతావరణం ఎలా వుండబోతుందనేదానికి సంకేతాలు. మొత్తానికి సమావేశాలు మొదలయ్యాయి. ఎవరిలో ఎంత కసి వుందో ఈ సమావేశాల్లోనే బయటపడుతుంది.

**రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందితే సీమాంధ్ర, తెలంగాణ ఎమ్మెల్యేలకు సంయుక్తంగా ఇవే చివరి శాసనసభ సమావేశాలనుకోవచ్చు. బిల్లు ఆమోదం పొంది రెండు రాష్ట్రాలు ఏర్పడితే ఎవరి సభలను వాళ్ళు నడుపుకుంటారు. రాష్ట్రం విడిపోతుందా... లేక కలుస్తుందా? అనే వాటిమధ్యలో మొదలయ్యాయి రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు. రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు జరిగిన సమావేశాలు ఓ ఎత్తు. ఇప్పుడు జరుగుతున్న సమావేశాలు మరోఎత్తు.**

PDF Compressor Free Version



# ఉరుకులు పెట్టని ఉద్యమం

జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం చప్పబడుతోంది. మునుపటి ఉత్సాహం, మొన్నటి ఉద్వేగం ఎక్కడా కనిపించడం లేదు. ఆందోళనలు, ఆక్రందనలు లేవు. మొక్కుబడి ధర్నాలు, నామమాత్రపు ర్యాలీలతో సరిపుచ్చుతున్నారు. రెండు నెలల పాటు నిర్విరామంగా సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నడిపించిన హీరోలంతా ఇప్పుడు తెరమరుగయ్యారు.

రాష్ట్ర విభజనను సిడబ్ల్యుసి ఆమోదించాక సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఉవ్వెత్తున ఉద్యమం ఎగిసింది. వేల సంఖ్యలో సోనియాగాంధీ దిష్టిబొమ్మలను తగలబెట్టారు. ప్రజల ఆగ్రహావేశాలకు కాంగ్రెస్ నాయకులే భయపడి బయటకు రాలేకపోయారు. నెల్లూరుజిల్లాలోను ఆ సమయంలో ఉద్యమం ఉధృతంగా సాగింది. రెండు నెలల పాటు నిరంతరాయంగా ఉద్యమం నడిచింది. ఆర్టీసీ బస్సులు కదల్లేదు. ప్రభుత్వ కార్యాలయాలు తెరవలేదు. విద్యాసంస్థలు నడవలేదు. జీతాలు లేకపోయినా ఉద్యోగులు, చదువులు సాగకపోయినా విద్యార్థులు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా వ్యాపారులు, ఇంట్లో పస్తులుంటున్నా లెక్కచేయకుండా కార్మికులు... ఇలా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో మమేకమయ్యారు. ఆరోజు ఎవరికివాళ్లు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నారు. రెండు నెలల తర్వాత ఉద్యమానికి విరామమిచ్చారు. అందరూ విధులకు పోతూ ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నారు.



ఇప్పుడు రాష్ట్ర విభజన బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రపతి నుండి శాసనసభకు రాబోతుంది. ఇక్కడనుండి పార్లమెంట్‌కు పోతుంది. అక్కడ బిల్లు ఆమోదం పొందితే రాష్ట్ర విభజన జరిగిపోయినట్లే. అంటే రాష్ట్ర విభజన క్లైమాక్స్‌కొచ్చిందన్నమాట. అయితే ప్రజలలో మునుపటి వేడి కనిపించడంలేదు. ఉద్యమాలతో బిల్లును అడ్డుకోవాలనే ప్రయత్నం చేయడంలేదు. ఎందుకంటే మేం ఎంత పోరాడినా లాభం లేదనే విషయం అర్థమైపోయింది. తెలంగాణపై కేంద్రం మొండిగా ముందుకెళుతోంది. ప్రజాఉద్యమాలను కేంద్రం ఏ మాత్రం లెక్కచేయడంలేదు. ఇక ఈ బిల్లును అడ్డుకోగలిగింది సీమాంధ్ర ఎంపీలు మాత్రమే. లేదంటే రాజ్యాంగ పరంగా ఎదురయ్యే చిక్కుల ద్వారానన్నా ఆగిపోవాలి. ప్రజలు ఎంపీలు, సుప్రీంకోర్టు మీదే భారం వేసారు.

## అధిష్టానమా..? ప్రజాభీష్టమా??





తెలంగాణ బిల్లు రాష్ట్ర శాసనసభకు రాబోతుంది. ఈ బిల్లును వ్యతిరేకించడానికి సీమాంధ్ర ఎమ్మెల్యేలు, అనుకూలంగా మాట్లాడడానికి తెలంగాణ ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రపతి పరిశీలనకు వెళ్ళిన టి-బిల్లు ఆయన విదేశీపర్యటన ముగించుకుని రావడంతో రాష్ట్ర శాసనసభకు వచ్చే అవకాశాలున్నాయి. ఈ బిల్లుపై తెలంగాణ నేతల్లో ఒకరంటే ఒక్కరూ విభేదించడం లేదు.

మరి అదేవిధంగా ఈ బిల్లును వ్యతిరేకించడంలో సీమాంధ్ర నేతలంతా ఏకతాటిపై నిలుస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. సీమాంధ్ర ఎంపీలలో అధిష్టానానికి అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు విడిపోయారు. సీమాంధ్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలలోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అధిష్టానంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇదే సమయంలో నెల్లూరుజిల్లాకు చెందిన ఆనం సోదరులు ఎటువంటి పాత్ర పోషించబోతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీళ్ళు సమైక్యవాదులే అయినా అంతకంటే కూడా కాంగ్రెస్ అధిష్టానానికి కరుడుకట్టిన విధేయులయ్యారు. ఈమధ్య కాలంలో కాంగ్రెస్‌ను చాలామంది వదిలి వెళ్లారు. కాని ఆనం సోదరులు అలాంటి ఆలోచనను తమ దరిచేరనీయడం లేదు. అధిష్టానం పట్ల మరింత భక్తిని ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీకి బిల్లు వస్తే వ్యతిరేకిస్తామని వీళ్ళు మొదటి నుండి చెబుతున్నారు. కాని అధిష్టానాన్ని ధిక్కరించే ప్రయత్నం చేస్తారా అనే అనుమానాలు వీరి మీద లేకపోలేదు.

## 'దేశం'వైపు... మాగుంట చూపు



**రాష్ట్ర విభజన జరిగినా, జరక్కపోయినా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఇక సీన్ లేదనే విషయం అర్థమైపోయింది. కాంగ్రెస్‌లో ఇంకా ఉండడమంటే ఇంజన్ ట్రబుల్ వచ్చిన విమానంలో ఎక్కి విదేశాలకు పోవడమే.**

ఈ కాలంలో పక్కా కాంగ్రెస్‌వాదులెక్కడున్నారు? కాంగ్రెస్‌పార్టీయే మా ఊపిరి, మా రక్తం అనేవాళ్ల శాతం బాగా తగ్గిపోయింది. రాజకీయాలు కూడా కమర్షియల్ రూపం సంతరించుకున్న ఈ కాలంలో ఆ పార్టీలోవున్న నాయకులు ఎవరి స్వార్థం వాళ్ళు, ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారు. ఈ కోణంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు వినిపిస్తుంది. కాంగ్రెస్‌ను నమ్ముకుని ఈసారి ఒంగోలులో నిలబడితే గెలవడం కలేనని ఆయనకు ఇట్టే అర్థమైపోతుంది. మొన్నటి ఒంగోలు అసెంబ్లీ ఉపఎన్నికలలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా మాగుంట పార్వతమ్మను నిలబెడితే కనీసం డిపాజిట్ కూడా దక్కలేదంటే కాంగ్రెస్ పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థమవుతుంది. కాబట్టి మాగుంట శీనయ్య మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసేంత మూర్ఖత్వానికి పోడు.

అలాగని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి పోలేదు. కొంత ఆత్మాభిమానం అడ్డురావచ్చు. అదీగాక వైకాపా ఒంగోలు సీటొచ్చే పరిస్థితి కూడాలేదు. ఇక ఆయనకున్న మార్గం తెలుగుదేశంలోకి పోవడమే. ఈమేరకు మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ కంటే తెలుగుదేశం అయితే కొంత బెటర్‌గా వుంటుంది. వచ్చే ఎన్నికలలో బీజేపీతో పొత్తు కుదిరితే నరేంద్రమోడీ ఇమేజ్ పనిచేసి గెలుస్తామనే నమ్మకం కూడా ఉంది.

2004ఎన్నికలప్పుడే మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో చేరడానికి సిద్ధమయ్యారు. ఆరోజు ఒంగోలు అసెంబ్లీ సీటును బాలినేని శ్రీనివాసరెడ్డికి ఇవ్వొద్దని ఆయన పట్టుబట్టారు. కాని వై.యస్. ఆ సీటును బాలినేనికే ఇచ్చారు. దీంతో అలిగిన మాగుంట తెలుగుదేశంలో చేరడానికి తొందరపడ్డాడు. దీని కోసం ఒంగోలులో అనుచరులతో సమావేశం కూడా పెట్టారు. అయితే మెజార్టీ సభ్యులు కాంగ్రెస్‌ను వదలొద్దని సూచించడంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు. కాని ఈరోజు కాంగ్రెస్‌ను వదిలి ఏదో ఒక పార్టీలో చేరకతప్పదు. వైకాపాలో ఎలాగూ ఛాన్స్ లేదు కాబట్టి ఇక తెదేపానే దిక్కు!

## కోవూరులో... పోటాపోటీ యాత్రలు

**కోవూరు తెలుగుదేశం టిక్కెట్ కోసం రేస్ మొదలైంది. పార్టీ అధిష్టానం హామీ ఇచ్చిందనే గ్యారంటీతో పెళ్ళకూరు శ్రీనివాసులరెడ్డి ఇప్పటికే యాత్ర మొదలుపెట్టగా, అదే సీటు మీద నమ్మకంతో వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కూడా పర్యటనలు మొదలుపెట్టడం విశేషం.**

తెలుగుదేశంపార్టీకి జిల్లాలో చాలాచోట్ల అభ్యర్థులు దొరక్క చస్తున్నారు. కాని కోవూరు నియోజకవర్గంలో మాత్రం ఇద్దరు నాయకులు పోటాపోటీగా యాత్రలు నిర్వహిస్తూ టిక్కెట్ రేసులో ముందు నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. కోవూరు సీటు విషయంలో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిల మధ్య పోటీ నెలకొంది. పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పార్టీలో ఎప్పటి నుండో వున్నాడు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలుగుదేశాన్ని వదిలి వెళ్లాక ఇక్కడ పార్టీకి నాయకత్వ కొరత ఏర్పడింది. కోవూరు ఉపఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పోటీ చేయించడం తెలిసిందే. ఉపఎన్నికలు కాబట్టి ఆయన పోటీ చేసాడు. సాధారణ ఎన్నికలకు సర్వేపల్లికి పోవాల్సిందే కదా!

ఇప్పుడు పార్టీ నాయకత్వమంటే పదిరూపాయలు ఖర్చు పెట్టుకుంటూ పార్టీ కేడర్‌ను కాపాడుకుంటుండమే. గత కొంతకాలంగా కోవూరు నియోజకవర్గంలో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఆ పని చేస్తూ వచ్చాడు. పార్టీ కార్యక్రమాలను తన సొంత ఖర్చుతోనే జరుపుతూ వచ్చాడు. కోవూరు సీటుపై బలంగా ఆశలు పెంచుకోబట్టే ఆయన సొంత డబ్బు పెట్టుకుంటూ వచ్చాడు.

కాగా ఈమధ్య కాంగ్రెస్ నుండి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలుగుదేశంలోకి రావడం జరిగింది. ఈయన కూడా కోవూరు టిక్కెట్ కోసమే చేరాడు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే దిశగా ఇద్దరూ యాత్రలు మొదలుపెట్టారు. ఈ యాత్రలో ఎవరు ముందు నిలుస్తారో చూడాలి!

## జిల్లాలోనూ చిగురిస్తున్న ఆశలు



# రాజధాని యోగం ఉందా?

హైదరాబాద్‌ను తెలంగాణ లాక్కుపోతే ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటు చేయాలి. విశాఖపట్నం నుండి నెల్లూరు దాకా పలు ప్రాంతాల పేర్లు రాజధానికి పరిశీలనలో ఉన్నాయి. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం వాళ్లు రాజధానిని తమ నగరానికి తన్నుకుపోవాలని చూస్తున్నారు. 45రోజుల్లోగా కొత్త రాజధానిని ప్రకటిస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో రాజధాని ఎక్కడ రాబోతుందనే దానిపై ఉత్కంఠత నెలకొంది.

పరిశీలనలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు-కావలి, కర్నూలు, అమరావతి ప్రాంతాలు ఉన్నట్లు తెలుస్తుంది. కొత్త రాజధాని ఎంపిక మరో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దారితీసేటట్లుండకూడదు. కేంద్రమంత్రులు పురంధరేశ్వరి, కిశోర్ చంద్రదేవ్‌లు కోరుతున్నట్లు విశాఖపట్నంలో రాజధానిని ఏర్పాటు చేస్తే ప్రత్యేక రాయలసీమ ఉద్యమం తప్పకపోవచ్చు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఏ మాత్రం అందుబాటులో ఉండదు విశాఖ. కేవలం కృష్ణ నుండి శ్రీకాకుళం వరకు వున్న జిల్లాలకు మాత్రమే అది అనువైన ప్రాంతం. కాబట్టి విశాఖ రాజధాని అంటే రాయలసీమ వాళ్ళు ఒప్పుకోరు. కర్నూలు రాజధాని పరిశీలనలో వుందిగాని అది కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల వారికి తప్పితే మిగతా 10జిల్లాలకు ఏమంత అనుకూలం కాదు. రోడ్డు, రైలు వసతులు తక్కువ. ఎయిర్‌పోర్టు లేదు. ముఖ్యంగా, కృష్ణ, ఉభయగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి అనువుగా ఉండదు.

విజయవాడ అందరికీ సెంటర్‌గా వుంటుంది గాని ఇక్కడ రాజధానిని ఏర్పాటు చేస్తే నికరంగా రెండుకార్లు పంటలు పండే వ్యవసాయ భూములను వాడుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సారవంతమైన భూములలో భవనాలు నిర్మించుకోవడం అంతటి తెలివితక్కువ పని ఇంకొకటి ఉండదు. అదీగాక ప్రైవేట్ సెక్టార్ వచ్చి ఇక్కడ భూములను కొని తమ సంస్థలను స్థాపించే అవకాశం ఉండదు.

అన్నింటితో పోలిస్తే బెస్ట్ ఆప్షన్ ఒంగోలు-కావలిల మధ్య రాజధానిని విస్తరింపచేయడమే. ఒంగోలు, కావలి అంటే ఆటోమేటిక్‌గా నెల్లూరు దాకా విస్తరించినట్లే. రెండు నగరాలను ఆధారంగా చేసుకుని రాజధానిని నిర్మించవచ్చు. రెండు నగరాల మధ్య ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయి. ఈ రెండు సిటీలమధ్యే అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయవచ్చు. సీమాంధ్రలోని అన్ని జిల్లాలతో రహదారి అనుసంధానం వుంది. రైలు కనెక్టివిటీని పెంచాల్సివుంది. రైలు, రోడ్డు వసతి వుంది కాబట్టి ఉత్తరాంధ్రజిల్లాల వారికి కూడా ఇబ్బంది వుండదు. ఒంగోలు, నెల్లూరు అంటే రాయలసీమవాళ్లు కూడా అభ్యంతరం చెప్పే పరిస్థితి వుండదు. ప్రభుత్వభూములే కాదు కారుచౌకగా మెట్టభూములు కూడా దొరుకుతాయి. ప్రైవేట్ సెక్టార్ వచ్చి స్థిరపడే దానికీ అవకాశముంది. ఇక నీటి అవసరాలు చూస్తే ఒంగోలు కంటే నెల్లూరు ఎంతో బెటర్. స్థిర నివాసానికి ఒంగోలు కంటే నెల్లూరు ఎంతో అనువుగా వుంటుంది. ఈ దృష్ట్యా ఒంగోలు, కావలిల మధ్య రాజధాని ఏర్పాటే అన్ని విధాలా శ్రేయస్కరం.

PDF Compressor Free Version



### కాంగ్రెస్‌కు మిగిలేది

# ఆ మూడు కుటుంబాలే...



జిల్లాలో కాంగ్రెస్ కథ క్లైమాక్స్‌కు చేరింది. ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటిని వదిలి సురక్షిత పార్టీలకు చేరుతున్నారు. కాంగ్రెస్ అనేది కుటుంబ పార్టీ. ఢిల్లీలో ఇందిరమ్మ కుటుంబం చేతిలో ఆ పార్టీ ఉంది. అలాగే రాష్ట్రస్థాయిలోనూ కొన్ని కాంగ్రెస్ కుటుంబాలున్నాయి. ఈ తరహాలోనే మన జిల్లాలో కూడా కొన్ని కాంగ్రెస్ కుటుంబాలున్నాయి. వాటిలో మేకపాటి కుటుంబం ఇప్పటికే కాంగ్రెస్‌ను వదిలి వెళ్ళిపోయింది. మాగుంట కుటుంబం కూడా రేపోమాపో అన్నట్లుంది!

నాయకుల పరంగా చూస్తే ఇతర పార్టీల వైపు దూకుతున్నారు. కాంగ్రెస్‌కు నలుగురు ఎమ్మెల్యేలుంటే వారిలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ఇతర పార్టీలవైపు మళ్ళుతున్నట్లు తెలుస్తుంది. ఆయా నియోజకవర్గాలలో వున్న కాంగ్రెస్ నాయకులు చాలామంది ఇప్పటికే వైకాపాలోకి వెళ్ళారు.

ఇక నికరంగా జిల్లా కాంగ్రెస్‌లో మిగలబోయేది మూడు కుటుంబాలే. వారిలో నేదురుమల్లి కుటుంబం మొదటిది. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో కూడా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆ పార్టీని విడువలేదు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా లేదు. ఆయన సతీమణి రాజ్యలక్ష్మి కూడా ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకుగా పాల్గొనక పోవచ్చు. ఇక వారి కుమారుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను వదిలే ప్రయత్నం చేయకపోవచ్చు. వచ్చే ఎన్నికల్లో వెంకటగిరి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసే ప్రయత్నాలలో అయనున్నాడు.

ఇక ఆనం సోదరులు కాంగ్రెస్‌ను వీడే పరిస్థితులులేవు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పెత్తనం వారిదే! రాష్ట్ర కాంగ్రెస్‌లో సైతం పెద్దరికం వారిదే కాబోతుంది. కాబట్టి కాంగ్రెస్‌ను వదిలి జగన్ ముందో, చంద్రబాబు ముందో చేతులు కట్టుకుని నిలబడలేరు కాబట్టి వాళ్ళు కాంగ్రెస్‌లోనే ఉండక తప్పదు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా సమాధి అయినా ఆ పార్టీని వదిలి పోలేనంతటి ప్రయోజనం పొందింది పనబాక కుటుంబం. నేదురుమల్లి వంటి ఉద్దండుడిని పక్కకునెట్టి పనబాక లక్ష్మికి రెండుసార్లు కేంద్రమంత్రి పదవి ఇచ్చింది సోనియా గాంధీ. అంతేకాదు నేదురుమల్లిని కాదని గత ఎన్నికల్లో గూడూరు టిక్కెట్‌ను కూడా పనబాక కృష్ణయ్యకు ఇవ్వడం జరిగింది. ఇంతచేసిన కాంగ్రెస్‌ను పనబాక దంపతులు వీడిపోయే పరిస్థితి లేదు. ఒకవేళ ఇంకో పార్టీలోకి పోయినా అక్కడ ఇంత సీన్‌రాదు. కాబట్టి కాంగ్రెస్‌తోనే వీరి పయనమని చెప్పవచ్చు.

జిల్లా కాంగ్రెస్‌కు మిగలబోయేది ప్రధానంగా ఈ మూడు కుటుంబాలే. అగ్రనాయకులెవరూ పార్టీలో వుండే ప్రయత్నం చేయడం లేదు. ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం ఈసారి సులభంగా టిక్కెట్లు వస్తాయనే ఆశతో కాంగ్రెస్‌లో ఉంటున్నారు.

## నందకుమార్‌కు పదోన్నతి



నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.నంద కుమార్‌కు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలో కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం నందకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీడీసీయల్ పరిధిలోని కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల చీఫ్ ఇంజనీర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. నంద కుమార్ ఎస్‌ఈగా జిల్లాలో 3 సంవత్సరాల 8నెలల 16 రోజులు పనిచేసారు. జిల్లాలో 193 సబ్‌స్టేషన్లు ఉండగా అందులో 79 నందకుమార్ హయాంలో నిర్మితమయ్యాయి. ఈ సందర్భంగా నందకుమార్‌ను విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, జాకీర్ హుస్సేన్ తదితరులు అభినందించారు.

### నెల్లూరు జిల్లా ఎస్‌ఈగా నాగశయనరావు

నెల్లూరుజిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా నాగశయనరావు నియమితులయ్యారు. ఈయన చిత్తూరు జిల్లాలోని ఏపి ఎస్పీడీసీఎల్ డిస్కం తిరుపతిలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నాగశయనరావు గతంలో నెల్లూరు జిల్లా ఆపరేషన్స్ టెక్నికల్ డిఇగా పని చేశారు.

## స్మైల్‌వాకర్స్‌కు అవగాహన శిబిరం




నెల్లూరు దర్గామిట్టలోని ఏసిసుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 11న స్మైల్ వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో సభ్యులకు రక్తపోటు, మధుమేహం, హృదయ సంబధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్లు శ్రీనివాసులు నాయుడు, తులం సుబ్బారావు, తులం నాగార్జున వైద్య పరీక్షలు చేసి వాకర్స్‌కు వ్యాధుల గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ పేరయ్య, సుబ్రహ్మణ్యం, గణపం రాజగోపాల్‌రెడ్డి, జివిఎల్.నారాయణ, ఏకొల్లు రాఘవరెడ్డి, సుబ్బారావు, జె.మస్తాన్‌రావు, లెనిన్ టైలర్స్ మదార్, గుప్తాశ్యాం, ఇఫ్కో రవీంద్ర, చంద్రా అబ్బాయినాయుడు, కె.వి.కృష్ణయ్య, భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌కు విరాళం



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రికి గణేశం కృష్ణారెడ్డి, శ్రీమతి కల్పనలు పదిలక్షల రూపాయల విరాళం అందజేసారు. 11వ తేదీ జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీ కాంతంను కలిసి వారు ఈ విరాళం అందించారు.

### GVK సారధ్యంలో

## ముస్తాబైన బెంగుళూరు ఎయిర్‌పోర్ట్

- డిసెంబర్ 14న కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా పేరు మార్పు
- నూతన టెర్మినల్ ప్రారంభం



దేశంలో ఎన్నో ప్రధాన విమానాశ్రయాలను ఆధునిక హంగులతో రూపొందించిన జివికె కంపెనీ ఈ పరంపరలో బెంగుళూరు ఎయిర్ పోర్టును అత్యాధునిక సొగసులతో తీర్చిదిద్ది ఈ నెల 14న పేరు మార్చి ప్రజలకు అంకితం చేయబోతుంది. గతంలో బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంగా వున్న ఎయిర్‌పోర్ట్‌ను బెంగుళూరు నగర నిర్మాత కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా మార్చారు. అలాగే మరో టెర్మినల్‌ను నూతనంగా నిర్మించారు.

ఈ నెల 14వతేదీన ఈ కార్యక్రమానికి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అజిత్‌సింగ్‌లు విచ్చేస్తున్నారు. వీరితో పాటు కేంద్రమంత్రులు వీరప్పమొయిలీ, కె.సి.వేణుగోపాల్, కర్నాటక రాష్ట్రమంత్రులు ఆర్.వి.దేశ్‌పాండే, రామలింగారెడ్డి, కె.జె.జార్జ్, ఎస్.ఆర్.పాటిల్, దినేష్‌గుండూరావు, శ్రీకృష్ణ భైరేగౌడ్, బెంగుళూరు మేయర్ బి.ఎస్.సత్యనారాయణ, ఇంకా పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొననున్నారు.

## వేళాయరా?

(మొదటిపేజీ తరువాయి)

తాడోపేడో తేల్చుకోవడానికే ఆతను సిద్ధంగా వున్నట్లు తెలుస్తుంది. ముఖ్యమంత్రిగా ఆయనకు ఇవి చివరిరోజులు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కాలంచెల్లే సమయం దగ్గర పడింది. మహా అంటే ఇంకో నాలుగు నెలలు పదవిలో వుంటాడు. సమైక్యాంధ్ర కోసం ఇప్పుడే పదవిని వదులుకుంటే ప్రజల్లో సమైక్యాంధ్ర కోసం పదవిని వదులుకున్న నాయకుడిగా గుర్తింపు పొందుతాడు. సీఎం పదవిని ఆయన ఇప్పుడు లెక్కచేయడం లేదు. అధిష్టానం తనను ఈ క్షణాన దిగిపొమ్మంటే దిగిపోవడానికి సిద్ధంగావున్నాడు. లేదా మొండిగా రాష్ట్రాన్ని విభజిస్తే రాజీనామా చేయడానికి రెడీగా వున్నాడు. కిరణ్ ఇంతగా తెగించడానికి వెనుక సొంతపార్టీ ఆలోచన ఉన్నట్లుగా తెలుస్తుంది. కాంగ్రెస్‌లో ఆయనకు సీన్ లేదు. కాంగ్రెస్‌కు ఇక రాష్ట్రంలో సీన్ లేదు. సీఎంగా పనిచేసిన కిరణ్ ఇతర పార్టీలలోకి పోలేడు. కాబట్టి సొంత పార్టీకి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీనికి ఏపి ఎన్జీఓల సంఘం సహకరిస్తున్నట్లు తెలుస్తుంది.

సీమాంధ్రలో చాలామంది కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడకుపోవాలో తెలియని పాలుపోని స్థితిలో వున్నారు. వాళ్ళంతా కూడా కిరణ్ సొంతపార్టీకి భరోసా ఇస్తున్నారు. వీళ్ళు అటు జగన్ వైపుకు పోలేరు, ఇటు చంద్రబాబు దగ్గర ఇమడలేరు. వీళ్ళంతా కిరణ్ సొంతపార్టీ కోసం ఎదురుచూస్తున్నారు. అధిష్టానంపై కిరణ్ విరుచుకుపడుతున్న తీరు చూస్తుంటే సొంతపార్టీకి ముహూర్తం ముంచుకొస్తున్నట్లుగానే ఉంది.

## మారిన హీరో!

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో చిరంజీవి వైఖరిని సీమాంధ్రులు ఛీకొడుతున్నారు. సోనియా విసిరిన పదవికి ఆశపడి ఆత్మాభిమానాన్ని ఇంతగా అమ్ముకోవాలా అని ఈసడించుకుంటున్నారు. తెలుగుజాతిని సోనియాగాంధీ తెగ నరుకుతుంటే ఇదేం అన్యాయమని ప్రశ్నించే సాహసం కూడా చేయలేదు మన తెలుగు తెర హీరో. రాష్ట్ర విభజనకు నిరసనగా చిరంజీవి కేంద్రమంత్రి పదవికి రాజీనామా పడేసి, సమైక్యాంధ్ర అజెండాతో చిరంజీవి మళ్ళీ ప్రజారాజ్యం జెండాను పడితే సీమాంధ్రులు హారతులుపట్టేవాళ్ళు. కాని చిరంజీవి ఆ సాహసం చేయలేదు. కనీసం ఆరుగురు కాంగ్రెస్‌ఎంపీలు కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి పూనుకుంటే దానికి మద్దతు తెలపలేదు సరికదా సోనియాను విమర్శించడం తగదంటూ తన చేతగానితనాన్ని చాటుకుంటున్నాడు. తనను హీరోచేసి, తన సినిమాలను ఆదరించిన తెలుగుప్రేక్షకులకు చిరంజీవి ఇచ్చే బహుమానం రాష్ట్ర విభజనకు తలాడించడమే. రాష్ట్రంలో లక్షలాదిమంది అభిమానులుండి కూడా తన హీరోయిజాన్ని విలనిజంగా మార్చుకున్న ఖ్యాతి చిరుదే!

## అభివృద్ధి బాటలో వియస్‌యూ



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన యూనివర్సిటీలలో విక్రమసింహపురి యూనివర్సిటీ అనూహ్యంగా అభివృద్ధి బాటలో ముందుందని వియస్‌యూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.రాజారామిరెడ్డి తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని వియస్‌యూ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మట్లాడారు. విద్యాభోధన, సిబ్బంది నియామకం అవసరమైన స్థలసేకరణ, భవన నిర్మాణానికి కావలసిన నిధులు సేకరణ, విద్యార్థుల ప్రగతి తదితర అంశాల్లో వియస్‌యూ ముందుందని తెలిపారు. 2014-2015 సంవత్సరానికి వర్సిటీకి చెందిన ఇంజనీరింగ్ కళాశాల, 5సంవత్సరాల ఎంబీఏ కోర్సులు, ఫార్మసీ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వియస్‌యూలోని 71 అధ్యాపక ఖాళీలకుగాను 47 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హతలున్న 19మంది అధ్యాపకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాజీవ్‌ఉచాహార్ శిక్షఅభియాన్ నిధులు రూ.50 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఈనెల 21న నెల్లూరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## పరువుపోయింది

(మొదటిపేజీ తరువాయి)

ఉరేస్తూ సోనియాగాంధీ తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయం కాంగ్రెస్‌కే ఉరితాడులా మారబోతుంది. రాష్ట్ర విభజనపై సోనియా వైఖరి సీమాంధ్రప్రజల మీద కసి పెంచుకుని చేస్తున్నట్లుగా ఉందిగాని పద్ధతిగా లేదు. సీమాంధ్రప్రజలకు ఏం న్యాయం చేస్తారో చెప్పకుండానే, సమస్యలు పరిష్కరించకుండానే ముందు రాష్ట్రాన్ని విభజించేయాలని చూస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడిగా సాధించిన అభివృద్ధినంతా తెలంగాణకు దోచిపెట్టేసి సీమాంధ్రను ఒట్టి గుడ్డలతో పంపించేయాలనుకుంటున్నారు. సోనియా ఒంటెద్దు పోకడలకు నిరసనగానే ఆరుగురు కాంగ్రెస్ ఎంపీలు తిరుగుబాటు చేసారు. వీళ్ళ దెబ్బకు కాంగ్రెస్ అధిష్టానానికి దిమ్మతిరిగింది.

దిగ్విజయ్‌సింగ్, కమలనాథ్ వంటి నాయకులు అవిశ్వాసాన్ని ఉపసంహరించుకోమని వారిని బ్రతిమలాడారు. అయినావాళ్ళు వెనక్కితగ్గలేదు. వీళ్ల అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా చేయడానికి కాంగ్రెస్‌పార్టీ నానాతంటాలు పడాల్సివచ్చింది. వీళ్ళ అవిశ్వాసానికి ప్రధాన ప్రతిపక్షం బీజేపీ గనుక మద్దతు తెలిపివుంటే యూపిఏ ప్రభుత్వం మటాష్! అయినా అటు ఎన్నికలతో, ఇటు సొంతపార్టీ ఎంపీల అవిశ్వాసంతో పూర్తిగా పరువుపోయాక ఈ ప్రభుత్వం ఇక ఉంటేనేం... పోతేనేం!

PDF Compressor Free Version






## సరైన తీర్పు

నాలుగు రాష్ట్రాల ప్రజలు సరైన తీర్పునిచ్చారు. అహంకారంతో విర్రవీగుతున్న కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం నేర్పారు. మేం ఏం చేసినా చెల్లుబాటవుతుందనే కాంగ్రెస్ నిరంకుశ ధోరణికి చెల్లుచీటీ రాసారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలను ప్రజలు మళ్ళీ మళ్ళీ ఆదరిస్తారనేదానికి మధ్యప్రదేశ్, చత్తీష్‌గఢ్ రాష్ట్రాలలో బీజేపీ గెలుపే ఉదాహరణ.

సీ.రాజీవి, నెల్లూరు.

## ఏ పుత్రుడు?

చంద్రబాబు ఆరోపించినట్లు జగన్ సోనియాకు దత్తపుత్రుడైతే ఆమె జగన్ ఓదార్పుయాత్రను కసిగా అడ్డుకొని 16నెలలు జైలులో ఎందుకు పెడుతుంది? జగన్ కాంగ్రెస్‌తో కుమ్మక్కయితే అసలు జైలుకెందుకెళ్తాడు? ఇక చంద్రబాబు విషయానికొస్తే ఆయన ప్రతిపక్ష పాత్రను విస్మరించి, కిరణ్ మైనారిటీ ప్రభుత్వాన్ని కంటికి రెప్పలా కాపాడి, చీకటిలో చిదంబరాన్ని కలసి ఛీబీఐ దర్యాప్తు నుండి తప్పించుకున్న చంద్రబాబు సోనియాకు దత్తపుత్రుడా? లేక చిత్త పుత్రుడా?

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## పసలేని బౌలింగ్

దక్షిణాఫ్రికా పర్యటనలో వున్న భారత క్రికెట్ జట్టుకు మొదటి రెండు వన్డేలలో చేదు అనుభవాలే మిగిలాయి. మన బౌలర్లలో పస లేదని తేటతెల్లమయ్యింది. భారత్ ఇప్పుడు బ్యాటింగ్‌పైనే ఆధారపడి వుంది. అది కూడా టాప్‌ఆర్డర్ మీదే. వారు కూడా విఫలమయ్యారంటే ఇక మిడిల్‌ఆర్డర్ చేతులెత్తేస్తుంది. ఈ పర్యటన అనుభవాలను దృష్టిలో వుంచుకుని భారత్‌కు నాణ్యమైన పేసర్లను తయారుచేయాల్సివుంది.

లక్ష్మీకృష్ణ, నెల్లూరు.

## బాధలు తప్పట్లేదు

నెల్లూరుజిల్లా ఎస్పీ ట్రాఫిక్‌పై కాస్త శ్రద్ధ చూపిస్తున్నా, ఆటోల మూలంగా ఏ మాత్రం ట్రాఫిక్ కంట్రోల్ కావట్లేదు. వీటిపై దృష్టిపెట్టాలి.

లక్ష్మీకృష్ణ, నెల్లూరు.

# 'ప్రభా'తం

మేం చేసిందే చట్టం. మేం చెప్పిందే న్యాయం. మేం వ్రాసిందే శిలాశాసనం. మేం నియంతలం. ఈ దేశానికి మేమే దిక్కు... ఈ దేశ ప్రజలకు రెండో గత్యంతరం లేదు... చచ్చినట్లు మా కాళ్ల క్రింద ఉండాల్సిందే అన్నంత అహంకార ధోరణితో వున్న కాంగ్రెస్‌పార్టీకి గూబ గుయ్‌మంది. నాలుగు రాష్ట్రాల ప్రజలు కొట్టిన చెంపదెబ్బకు మైండ్ బ్లాకై సౌండ్ రీసౌండ్ వస్తోంది. కాంగ్రెస్ అధిష్టానానికి నెత్తినెక్కివున్న కళ్లు ఒక్కసారిగా దిగొచ్చాయి.

2014సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన మధ్యప్రదేశ్, చత్తీష్‌ఘఢ్, రాజస్థాన్, ఢిల్లీ, మిజోరం ఫలితాలతో కాంగ్రెస్‌కోటలు బద్ధలయ్యాయి. 2014 లోక్‌సభ ఎన్నికల ద్వారా రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలనుకుంటున్న కాంగ్రెస్ కలలు కల్లలయ్యాయి. అబ్బాయిగారి నాయకత్వం కోసం దేశప్రజలు ఆబగా ఎదురుచూడ్డం లేదనే విషయం ఈ ఫలితాలతో తేటతెల్లమైంది. రాహుల్ వల్ల కాంగ్రెస్‌కు ఓట్ల పరంగా ఒరిగేదేమీ లేదని తేలిపోయింది. ఇంకా విచిత్రమేమిటంటే కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం వెలగబెడుతున్న నిర్వాకం వల్ల ఢిల్లీలో సీఎంగా మంచిపేరు తెచ్చుకున్న షీలాదీక్షిత్ వంటివారు కూడా ఓటమి చవిచూడాల్సి వచ్చింది. పదేళ్ళ యూపిఏ పాలన పెర్ఫార్మెన్స్ ఎంత ముదనష్టంగా ఉందో ఈ 5రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి.



### అవినీతికి చెంపదెబ్బ

2014సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన మధ్యప్రదేశ్, చత్తీష్‌గఢ్, రాజస్థాన్, ఢిల్లీ, మిజోరం ఫలితాలతో కాంగ్రెస్ కోటలు బద్ధలయ్యాయి. 2014 లోక్‌సభ ఎన్నికల ద్వారా రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలనుకుంటున్న కాంగ్రెస్ కలలు కల్లలయ్యాయి.

ఈ సమీఫైనల్స్‌లో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎంత జీర్ణించుకుందామనుకున్నా మింగుడుపడడానికి సాధ్యంకాని ఫలితాలివి. కాంగ్రెస్ నాయకత్వ అసమర్థతను ఈ ఫలితాలు కళ్ళకు కడుతున్నాయి. వరుసగా మూడుదఫాలు ఢిల్లీలో రాజ్యమేలిన కాంగ్రెస్‌పార్టీ ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక '8' అంకెకు పరిమితమైంది. మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నా కూడా షీలాదీక్షిత్‌కొలేను యూపిఏ ప్రభుత్వ వైఫలాలు వెంటాడాయి. కేంద్రప్రభుత్వం పట్ల వున్న వ్యతిరేకతను ఈమె సుపరిపాలన అడ్డుకోలేకపోయింది. జనలోక్‌పాల్ బిల్లా ఉద్యమం నుండి పుట్టుకొచ్చిన అరవింద్ కేజ్రీవాల్ ఆమ్‌ఆద్మీ పార్టీ ఇక్కడ కాంగ్రెస్‌ను తుడిచిపెట్టింది. అదే సమయంలో ఇక్కడ సంపూర్ణ మెజార్టీపై ఆశలు పెట్టుకున్న బీజేపీని ఆమ్‌ఆద్మీనే ఐదుసీట్ల దూరంలో నిలిపింది. ఇక్కడ ఆమ్‌ఆద్మీ లేకుంటే ఈసారి ఢిల్లీ పీఠం బీజేపీదేననడంలో ఎలాంటి సందేహం లేదు.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ మళ్ళీ హ్యాట్రిక్ కొట్టడం వెనుక ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కృషి ఎంతో వుంది. సీఎం అంటే కామన్‌మెన్ అనే దానికి రోల్‌మోడల్ ఆయన. 2008ఎన్నికలలో కంటే ఈసారి బీజేపీకి సీట్లు పెరిగాయంటే ఆ రాష్ట్ర ప్రజలు ఆయన పరిపాలన పట్ల ఎంతగా ఆకర్షితులయ్యారనేదానికి నిదర్శనం. ప్రభుత్వ వ్యతిరేకత మీద కొండంత ఆశ పెట్టుకున్న కాంగ్రెస్‌కు ఇక్కడ అలాంటి అనుకూల వాతావరణమేదీ లేకుండా పోయింది. తాము చేసిన పనులు చెప్పుకోవడం, అన్ని వర్గాల ప్రజలను మెప్పించడం ద్వారా ఇక్కడ శివరాజ్‌సింగ్ చౌహాన్ హ్యాట్రిక్ హీరో అయ్యారు.

చత్తీష్‌గఢ్‌లోనూ బీజేపీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రమణసింగ్ ఆన్నీతానై పార్టీని మరోసారి విజయపథంలో నడిపించారు. ఫలితాల సమయంలో ఓటింగ్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ నడిచింది. అయితే చివరకు బీజేపీదే పైచేయి అయ్యింది. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి రమణసింగ్ తన పార్టీకి విజయాన్ని సాధించిపెట్టాడు. ఎన్నికల ప్రచారసమయంలో మావోయిస్టులు జరిపిన దాడిలో వి.సి.శుక్లా, మహేంద్రకర్మ వంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు చనిపోయారు. అయితే ఆ సానుభూతి కొంతవరకు ఓటింగ్‌పై ప్రభావం చూపింది. బస్తర్ డివిజన్‌లో 12సీట్లకు గాను కాంగ్రెస్ 8సీట్లు గెలుచుకుని బీజేపీకి కొంత పోటీ ఇవ్వగలిగింది. కాంగ్రెస్ కొంతవరకు గట్టిగా నిలబడగలిగింది ఇక్కడే! అది కూడా మావోయిస్టుల దాడితో వచ్చిన సానుభూతి మూలంగానే! ఇక మిజోరాం ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది.

మధ్యప్రదేశ్, చత్తీష్‌గఢ్‌లలో బీజేపీ మూడోసారి కూడా అధికారాన్ని నిలబెట్టుకుంటే, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక్కసారికే చాపచుట్టేసింది. రాజస్థాన్‌లో ఆ పార్టీ ఘోరపరాజయాన్ని మూటగట్టుకుంది. 200స్థానాలున్న అసెంబ్లీలో 199స్థానాలకు ఎన్నికలు జరిగితే వీటిలో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు 21 మాత్రమే. ఐదేళ్లకే ఆ పార్టీ మీద ప్రజలు ఎంతగా విసిగిపోయారనేదానికి ఈ ఫలితాలే సాక్ష్యం.

ఈ ఫలితాలు రేపటి సార్వత్రిక ఎన్నికలకు ఒక హెచ్చరిక లాంటివే. అధికధరలు, అవినీతితో విసిగివేసారిన ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఉంటే దానివైపు మొగ్గుచూపుతున్నారు. దానికి మించిన ప్రత్యామ్నాయం వుంటే ఆ వైపుకు కూడా చూస్తున్నారనేది ఢిల్లీ ఫలితాలతో వెల్లడైంది. యూపిఏ పాలనలో పెరిగిన ధరలు, చుట్టుముట్టిన కుంభకోణాలు, ద్రవ్యోల్బణం, అవినీతి, అసమర్థపాలన కాంగ్రెస్‌కు శరాఘాతంగా మారాయి. కాంగ్రెస్ వైఫల్యాలే ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి వరమయ్యాయి. కాంగ్రెస్ వైఫల్యాలతో పాటు ఆయా రాష్ట్రాలలో సమర్థవంతమైన పరిపాలన, సమర్థవంతమైన నాయకత్వం, దిగువస్థాయికి దూసుకెళ్ళే కేడర్, అన్నింటికిమించి మోడీయిజం బీజేపీని గెలుపుబాట పట్టించాయి.

## 'అంతర్'జాతీయం

- మత హింస నిరోధక బిల్లు ఒక వర్గం ప్రజలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని రాజ్యసభ విపక్ష నాయకుడు అరుణ్‌జైట్లీ అభిప్రాయపడ్డారు. అల్లర్లలో ఇరువర్గాల ప్రమేయమున్నా ఈ చట్టం క్రింద ఒక వర్గప్రజలను ప్రాసిక్యూట్ చేస్తారని, ఈ బిల్లును పార్లమెంటులో అడ్డుకుంటామని ఢిల్లీలో జరిగిన హిందుస్థాన్ టైమ్స్ నాయకత్వ సదస్సులో చెప్పారు.
- లింగ వివక్షతను రూపుమాపేందుకు, మహిళా సాధికారత కోసం ఐక్యరాజ్య సమితి మహిళా విభాగానికి భారత్ 6కోట్ల రూపాయల విరాళమిచ్చింది. ఐక్యరాజ్య సమితి మహిళా విభాగంలో భారత్ వ్యవస్థాపక సభ్య దేశంగా ఉంది.
- యజమాని, ఇద్దరు చిన్నారులను హత్యచేసిన కేసులో ముకేష్ మహతి, ఉపేంద్రకుమార్ ఠాగూర్ అనే ఇద్దరు నిందితులకు పాట్నా కోర్టు ఉరిశిక్ష విధించింది.
- 1971 యుద్ధంలో పాక్‌ను మట్టికరిపించిన మిగ్-21 విమానాలకు భారత వైమానిక దళం వీడ్కోలు పలికింది. దశాబ్దాల కాలంగా ఇవి భారత సైన్యానికి సేవలందించాయి. 11వ తేదీ పశ్చిమబెంగాల్‌లోని కలైకుండ వైమానిక స్థావరంలో చివరిసారిగా ఈ విమానాలతో విన్యాసాలు నిర్వహించి వీడ్కోలు పలికారు.
- దేశ ప్రజలు బలహీనమైన పాలకులను కోరుకోవడం లేదని సొంతంగా నిర్ణయాలు తీసుకోగల ఇందిరాగాంధీ లాంటి శక్తివంతమైన నాయకులను కోరుకుంటున్నారని ఎన్సీపీ అధినేత, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరద్‌పవార్ పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓటమిపై ఆయన ఘాటుగా స్పందించారు. తాజా ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పై తమ ఆక్రోశం వెలిబుచ్చారని, వీటిపై కాంగ్రెస్సే కాకుండా తమలాంటి పార్టీలు ఆలోచించాల్సి వస్తుందన్నారు.
- బ్రిటన్‌లో భారత విద్యార్థులు చాలా తక్కువమంది ఉన్నారని ఆ దేశ వాణిజ్యశాఖ సహాయమంత్రి విన్స్‌కేబుల్ ఆందోళన వ్యక్తం చేసారు. భారత పర్యటనకు వచ్చిన ఆయన 9వ తేదీ న్యూఢిల్లీలో జరిగిన భారత్-బ్రిటన్ ఆర్థిక, వాణిజ్య సంయుక్త కమిటీ 9వ సమావేశంలో మాట్లాడుతూ భారతీయ విద్యార్థులపై ఎటువంటి పరిమితులు విధించబోమని, సంఖ్యాపరిమితి లేకుండా భారత విద్యార్థులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.
- ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకు థాయ్‌లాండ్ ప్రధానమంత్రి యింగ్లక్‌షినవ్రత తలొంచారు. ఆ దేశ పార్లమెంట్‌ను రద్దుచేసి తాజాగా ఎన్నికలకు పిలుపునిచ్చింది.
- జన్‌లోక్‌పాల్ బిల్లు ఆమోదం కోరుతూ అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నా హజారే 10వ తేదీ నుండి మహారాష్ట్రలోని సొంత గ్రామమైన రాలేగావ్‌సిద్ధిలో ఆమరణదీక్ష చేపట్టారు. ఆయన దీక్షా శిబిరానికి అభిమానులు వేలాదిగా తరలివస్తున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- అవినీతిపరులందరికీ ఇదేగతి. - ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు.
వ్యాఖ్య :- *మీకు పదేళ్ల క్రితమే ఈ గతి పట్టినట్లుంది.*

వార్త :- ఈ ఫలితాలను మనసుతో విన్నాం. - రాహుల్‌గాంధీ.
వ్యాఖ్య :- *చెవితో వినండి... ఉపయోగముంటుంది.*

వార్త :- అంతర్గత పోరు వల్లే ఓటమి. - కాంగ్రెస్.
వ్యాఖ్య :- *సోనియా, రాహుల్‌లు కాదంటారు.*

వార్త :- కాంగ్రెస్‌కు సాయం చేయడమే మా పాపమా? - విజయవాడ సభలో కిరణ్.
వ్యాఖ్య :- *పాలుపోసిన చేతుల్ని కాటేయడమే కదా కాంగ్రెస్ రాజకీయం.*

వార్త :- అడిగినది ఇవ్వకుంటే వ్యతిరేకంగా ఓటేస్తా. - టీ-బిల్లుపై పురంధరేశ్వరి.
వ్యాఖ్య :- *మీది అమాయకత్వమనుకోవాలా? అజ్ఞానమనుకోవాలా?*

వార్త :- మొదటిరోజునే తెలంగాణపై చర్చపెట్టాలి. - ప్రభుత్వ చీఫ్‌విప్ గండ్ర.
వ్యాఖ్య :- *మొదటిరోజే రచ్చ పెట్టాలి అన్నట్లుగా వుంది.*

వార్త :- బీసీలకు 50శాతం టిక్కెట్లివ్వాలి. - కేసీఆర్‌కు కృష్ణయ్య వినతి.
వ్యాఖ్య :- *సీమాంధ్రలో కాంగ్రెస్ టిక్కెట్లడగండి... ఇచ్చేస్తారు.*

వార్త :- రాజీనామా పత్రాలు నా చేతికిస్తే ఎలా ఆమోదింపచేయవచ్చో చూపిస్తా. - నందమూరి హరికృష్ణ.
వ్యాఖ్య :- *అందరూ మీలాగే ఉంటారనుకుంటున్నారా?*

వార్త :- ఫలితాలతో బోసిపోయిన సోనియా కార్యాలయం.
వ్యాఖ్య :- *భజన కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపేసారేమో!*

వార్త :- సోనియాను అవమానించడం అనాగరికచర్య. - చిరంజీవి.
వ్యాఖ్య :- *వాళ్ళు చేస్తున్న పనులు నాగరికంగా ఉన్నాయా?*

వార్త :- దేశంలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. - జె.సి.దివాకరరెడ్డి.
వ్యాఖ్య :- *మీ బాధ ఆ భగవంతుడికే తెలియాలి.*

వార్త :- సొంత ఎంపీలే అవిశ్వాసం పెట్టడం బాధాకరం. - దిగ్విజయ్.
వ్యాఖ్య :- *సొంతపార్టీయే వాళ్ళను పనికిమాలినవాళ్ళుగా చేయడం ఇంకా బాధాకరం కదా!*

# క్రషింగ్ లేక రైతులు నలుగుతున్నారు

నెల్లూరుజిల్లా కోవూరు సహకార చక్కెర కర్మాగారంలో క్రషింగ్ ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. కోవూరు నియోజకవర్గంలో 1.80లక్షల టన్నుల చెరకు క్రషింగ్‌కు సిద్ధంగా వున్నా ఇప్పటికీ క్రషింగ్ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బాయిలర్ మరమ్మత్తులు ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నెల్లూరు, చిత్తూరు జిల్లాలో మినహా మిగతా అన్ని జిల్లాలోని సహకార కర్మాగారాలు బకాయిలు పూర్తిగా చెల్లించాయి.

2012-13 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కోవూరు చక్కెర కర్మాగారం రైతులకు 5.40కోట్లు, ఉద్యోగులు జీతాలు 4.80కోట్లు మరమ్మతులకు అవసరం వుంది. బాయిలర్ మరమ్మతులకు దాదాపు రెండు నెలలు సమయం పడుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. దీంతో అభ్యర్థనల మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ నాయుడుపేట చక్కెర కర్మాగారంలో రోజుకు వెయ్యి టన్నులు క్రషింగ్ జరిపేందుకు ఒప్పందం కుదిర్చారు. దీంతో దాదాపు మూడునెలలు క్రషింగ్ జరిగినా నెలకు ముప్ఫై వేల టన్నులు చొప్పున క్రషింగ్ ముగిసే నాటికి 90వేల టన్నులు మాత్రం క్రషింగ్ జరిగే అవకాశముంది. మిగిలిన 90వేల టన్నుల పరిస్థితి ఏమిటో అన్నదే ప్రశ్న. కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని కలెక్టర్ శ్రీకాంత్ ఫ్రీజోన్‌గా ప్రకటిస్తే మేలు జరుగుతుందని రైతుల ఆశ. ఫ్రీజోన్ ప్రకటిస్తే రైతులు తమ చెరుకును రాష్ట్రంలోని ఏ కర్మాగారానికైనా తరలించుకునే అవకాశం వుంది.

# అన్ని దుకాణాలకు, సంస్థలకు లేబర్ లైసెన్స్ తప్పనిసరి

వ్యాపారస్తులు, తమ దుకాణాలకు లేబర్ లైసెన్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని ఈనెల 7న ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.చలమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గుమాస్తాలు తదితర ఉద్యోగులులేని దుకాణాలు సంస్థలకు మినహాయింపు వుండేదని 2013లో ప్రభుత్వం జారీ చేసి వున్న ఉత్తర్వుల ప్రకారం అన్ని సంస్థలు తప్పనిసరిగా లేబర్ లైసెన్స్ పొందాలని పేర్కొన్నారు. దీంతో ఈ దుకాణాలు ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలు, ఆదివారాల్లో కూడా తెరిచి వ్యాపారం జరుపుకో వచ్చని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ నెంబరు పొంది రిజిస్టర్లు, విజిట్ బుక్‌లు వుంచుకోవాలని తెలిపారు. ఈ విషయం తెలియక ఇప్పటిదాకా ఫీజులు చెల్లించని వారు డిసెంబరు 13లోపల 25% అధికరుసుముతో జనవరి 1 నుండి 50% అధిక రుసుముతో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు.

# కారులో సొమ్మునే కాజేసారు

నెల్లూరు నగరం రమేష్‌రెడ్డి నగర్‌లో ఉన్న జనతా హోటల్ వద్ద సోమవారం బొలోరా వాహనంలో ఉంచిన రూ.6.50 లక్షలు నగదును పట్టపగలు చోరీ చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే నెల్లూరు మాగుంటనగర్ లెక్చరర్స్ కాలనీలో ఏడులూరు నిర్మల్‌కుమార్‌రెడ్డి నివసిస్తున్నారు. ఇతను కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో బొగతోటలోని ఓబ్యాంకులో రూ.6.50 లక్షలు డ్రా చేసి బ్యాగును తన బొలోరా వాహనంలో వెనుక సీట్లో ఉంచారు. అనంతరం రమేష్‌రెడ్డి నగర్‌లో ఉన్న జనతా హోటల్‌కి వెళ్ళి భోజనం చేసాడు. తర్వాత ఇంటికి చేరుకుని వాహనాన్ని పార్కు చేసి బ్యాగు కోసం చూడగా కనిపించలేదు. దీంతో నిర్మల్‌కుమార్‌రెడ్డి 4వ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. సిఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చర్మకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో...

# అంబేద్కర్ వర్ధంతి సభ

నెల్లూరు నవాబుపేట కుసుమ హరిజనవాడలో ఈనెల 6న నెల్లూరు జిల్లా చర్మకారుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మన్నేపల్లి దాసు సారధ్యంలో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మన్నేపల్లి దాసు మాట్లాడుతూ ఆ మహనీయుని ముందుచూపుతో ఎస్సీలు రిజర్వేషన్ సౌకర్యం పొంది సమాజంలో అంతో ఇంతో అభివృద్ధిని సాధించగలిగారని అన్నారు.

కార్యక్రమంలో వివిధ సామాజిక సేవా సంస్థల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాసులు, ప్రభుత్వ సమాచార సేకరణ కార్యకర్త సురేష్ పూటుకూరు, చర్మకారుల సంక్షేమ సమాఖ్య నాయకుడు సుందర రాజన్, సభ్యులు పాల్గొన్నారు.

# 'ప్రభంజనం' చిత్ర యూనిట్ సందడి

నెల్లూరు జిల్లా పరిసర ప్రాంతాల్లో "ప్రభంజనం" చిత్రం ఆఖరి షెడ్యూల్‌ను చిత్రీకరిస్తున్నట్లు చిత్ర నిర్మాత దర్శకుడు వెంద్రాతి భాస్కరరావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో దర్శకుడు భాస్కరరావుతో పాటు చిత్ర కథానాయకులు, కథానాయికలతో పాల్గొన్నారు. ఓటర్లలో చైతన్యం కల్పించే ఉద్దేశ్యంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈచిత్రానికి గీతాలను సిరివెన్నెల, మ్యూజిక్ ఆర్‌పి పట్నాయక్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. నాగబాబు, వాజిద్ ప్రముఖ పాత్రల్లో నటిస్తున్నారన్నారు. జనవరి 11న ఆడియో విడుదల, జనవరి చివరి వారంలో చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కథానాయకులు రంగం ఫేం అజ్మల్, సందీప్, కథానాయికలు పంచి బోరా, అరుషి పాల్గొన్నారు.

### మహిళల ఫిర్యాదులపై...

# వెంటనే కేసులు నమోదు చేయండి

### జిల్లా ఎస్పీ రామకృష్ణ

మహిళలు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే కేసులు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే మీపై చర్యలు తప్పవని నెల్లూరు జిల్లా ఎస్పీ పిపియస్ రామకృష్ణ జిల్లా పోలీసులను హెచ్చరించారు. పోలీసుల ప్రజా విజ్ఞప్తుల దినంలో భాగంగా సోమవారం పలువురు మహిళలు నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ హాలుకు వచ్చారు. న్యాయం చేయాలని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం చేయక పోగా నేరస్తులకు అండగా నిలుస్తున్నారంటూ ఎస్పీకి వినతిపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఎస్పీ, ఎస్సైలు, సిఐలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. తాను మూడు నెలలుగా పరిశీలిస్తున్నానని గ్రీవెన్స్‌డేకు ఎక్కువగా మహిళల కేసులే వస్తున్నాయని పోలీసుల నిర్లక్ష్యం ఎక్కువగా వుండడంతో, నిందితులు సులభంగా తప్పించుకుంటున్నట్లు అర్థమవుతోందని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ బిఆర్ ఎస్‌మూర్తి, నెల్లూరు నగరం, రూరల్ డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, రాంబాబు, ఎస్బీ సిఐ జయరామసుబ్బారెడ్డి, సిసియస్ సిఐ వీరాంజనేయరెడ్డి, మహిళా సిఐ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పైకా కబడ్డీ పోటీల్లో

# సత్తా చాటిన నెల్లూరు క్రీడాకారిణులు

పంచాయతి యువ క్రీడాఖేల్ అభియాన్(పైకా) 6వ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ బాలికల ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు రన్నర్స్‌గా అదిలాబాద్, మూడోస్థానంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు నిలిచింది. జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయిపైకా కబడ్డీ అండర్-16 టోర్నీ నిర్వహించారు. 22 జిల్లాల నుంచి 528 మంది బాలబాలికలు, వందమంది సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రాష్ట్రాన్ని తగలబెడుతుంది

### తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తెదేపా నగర కన్వీనర్ తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో జాతీయ రహదారి పై ఈనెల 7న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలల్లో కూలిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌ను తగలబెడుతోందని మండిపడ్డారు. జగన్, సోనియాలు కుమ్మక్కవడంతోనే విభజన జరుగుతోందన్నారు. తాళ్ళపాక రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి రాజకీయానికి తావులేకుండా సీమాంధ్ర నాయకులందరూ ఏకమై ఉద్యమంలో పాల్గొని రాష్ట్రవిభజనను అడ్డుకోవాలన్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జగన్‌ను ముఖ్యమంత్రిని, రాహుల్‌ను ప్రధానిని చేసేందుకే సోనియాగాంధీ రాష్ట్రాన్ని విభజిస్తున్నారని పేర్కొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో తీరని అన్యాయానికి గురవుతున్న సీమాంధ్ర ప్రాంత భవిష్యత్తు తరాలు కాంగ్రెస్‌పార్టీని క్షమించవని అన్నారు. నెల్లూరు వేదాయపాలెం అయ్యప్పగుడి నుంచి మోటారు సైకిళ్ళపై ర్యాలీగా వచ్చిన నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, నూనె మల్లికార్జునయాదవ్, చిరంజీవినాయుడు, ఎం.రామయ్య, డి.సుబ్బారావు, బుజ్జయ్య, ఎస్.రవిచంద్ర, తిరుమల నాయుడు, జలదంకి సుధాకర్, ఖాదర్‌బాషా తదితరులు ఇక్కడ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వభూమిని కాపాడండి

### జిల్లా కలెక్టర్‌కు మేకపాటి గౌతంరెడ్డి వినతి

నెల్లూరు జిల్లా మర్రిపాడు వద్ద ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులు తమ అనుచరులకు కట్టబెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, అన్యాక్రాంతమవుతున్న భూపందేరాన్ని అడ్డుకోవాలని కోరుతూ నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు మంగళవారం వైయస్సార్ సిపి ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి గౌతంరెడ్డి వినతి పత్రం సమర్పించారు. మర్రిపాడు వద్ద వున్న దాదాపు 30 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా కట్టబెట్టనున్నట్లు చెప్పారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు ప్రభుత్వ భూమికి పట్టాలు ఇవ్వకుండా నిలిపి వేయాలని గౌతంరెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో వైయస్సార్‌సిపి జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ ఉన్నారు.

# కావలి డిఎస్పీ మారాడు

కావలి డిఎస్పీ నియామకానికి రాజకీయ రంగు అంటుకుంది. ఇటీవల జరిగిన బదిలీలలో ఇక్కడ డిఎస్పీగా వున్న ఇందిర బదిలీ కాగా మహేశ్వరరాజును కొత్త డిఎస్పీగా నియమించారు. నెల్లూరు రూరల్ డిఎస్పీగా పనిచేస్తున్న బాలవెంకటేశ్వరరావును హైదరాబాద్‌లో విఆర్‌కు బదిలీ చేసారు. అయితే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టుబట్టి బాలవెంకటేశ్వరరావును కావలికి మార్పించుకున్నారు.

ఇక్కడ పోస్టింగ్ వచ్చిన మహేశ్వర రాజును ఇటీవలే పోస్టింగ్ ఇవ్వకుండా వెనక్కిపంపారు.

### వైయస్సార్ పుణ్యమా అని

# ఆనం మంత్రయ్యాడు

మహానేత వైయస్ఆర్ పుణ్యమా అని ఆనం రామనాయరాయణరెడ్డికి మంత్రి పదవి వచ్చిందని, అలాంటిది వైయస్సార్ కుటుంబ సభ్యులను ఆనం సోదరులు విమర్శించడం తగదని వైయస్సార్ సిపి కేంద్ర పాలకమండలి సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల నెల్లూరుజిల్లా అనంత సాగరం మండలం అలుగువాగు సెంటర్ వద్ద పార్టీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో రాజమోహన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రాన్ని విభజిస్తే కృష్ణా, గోదావరి నీటి సమస్యలు, రాజధాని సమస్య జటిలమవుతాయన్నారు. ఈకార్యక్రమంలో వైయస్సార్ సిపి జిల్లా కన్వీనర్ మేర్గ మురళీధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరులో త్రాగునీటికి కటకట

గూడూరు పట్టణంలో ప్రజలు త్రాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇందరు మార్గంలో రోడ్డుపనుల వల్ల కండలేరు పైపులైన్ పూర్తిగా ధ్వంసమై లీకేజీ కావడంతో గూడూరు పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య ఏర్పడింది. అయితే పురపాలక సంఘం అధికారులు దీనికి అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

64కోట్లు ఖర్చుపెట్టి కండలేరు నుండి త్రాగునీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటికి సంబంధించి పైప్‌లైన్లు నాసిరకంగా వుండడంతో లీకేజీలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మత్తులు చేసి ప్రజల తాగునీటి సమస్యలు తీర్చాల్సి వుంది.

### "సన్" ఆధ్వర్యంలో...

# స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు




స్వామివివేకానంద 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 8న నెల్లూరు టౌనుహాలు రీడింగ్‌రూమ్‌లో సన్ యూత్ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో దేశభక్తి పాటలు, వక్తృత్వ పోటీలు, కవిసమ్మేళనం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆనం రంగనయూర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు యస్.వి.రమేష్, చెన్నై హాస్పిటల్స్ సమాచార కేంద్రం అధినేత సాయిప్రసాద్‌లు పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. సన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆబోతుల దశయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పినాకిని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, దళిత విద్యార్థిసేన అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్, జూనియర్ మెగాస్టార్ చంటి, కవులు దయాకర్‌రెడ్డి, పద్మనాభం, పి.వి.సుబ్బారెడ్డి, సీతారామస్వామిలను గౌరవంగా సత్కరించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో "సృజన" అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ, గాయకులు కె.ఆనందరావు, ఇంజనీర్ యన్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## నేతలంతా హైదరాబాద్‌లో...

శీతాకాల అసెంబ్లీ సమావేశాలు మొదలు కావడంతో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. దీంతో జిల్లాలో జరుగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమాలలో వాళ్ళు పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. ఇక అసెంబ్లీ సమావేశాలలో మన ఎమ్మెల్యేలు ఏమేరకు విరగదీయనున్నారనేది ప్రశ్నార్థకంగా వుంది. ఈ అసెంబ్లీ సమావేశాలలో తెలంగాణ బిల్లు తప్పితే మరో అంశంపై చర్చకు తావుండదు. తెలంగాణబిల్లు అసెంబ్లీకి వస్తే ఉతికిఆరేస్తామని మన ఎమ్మెల్యేలు మొన్నటి వరకు ప్రగల్భాలు పలుకుతూ వచ్చారు. వీళ్లు ఈ సమావేశాలలో ఏ మాత్రం ఉతికి ఆరేస్తారో చూడడానికి జనం కాచుకుని వున్నారు.

## జనవరిలో పక్షుల పండుగ



ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లే రేపు జనవరిలో కూడా పక్షుల పండుగ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. నేలపట్టు, పులికాట్ పర్యాటక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహిస్తుంటారు. ఈ రెండురోజులపాటు జరిగే ఈ పండుగలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పర్యాటకులు పెద్దసంఖ్యలోనే వస్తుంటారు. ఈ పక్షులపండుగ సంక్రాంతి పండుగకు ముందా, వెనుకా అనేది త్వరలో తేలబోతుంది.




ఈ నెల 10వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్‌లో 2వ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను ఎంపైరింగ్ చేసి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.శ్రీకాంత్

## నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కల్యాణమండపంలో శ్రీనివాసుని కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, నాగేంద్రస్వామి, రాఘవయ్య నేతృత్వంలో తొలుత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం విశేషపూజలు, అభిషేకాలు, చందనంతో తిరుమంజనాన్ని నిర్వహించారు. రక్షబంధనం, యజ్ఞోపవీతధారణ కన్యాదానం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు గోవిందనామస్మరణంతో శ్రీవారు మాంగల్యధారణ చేసారు. అనంతరం తలంబ్రాలు, మంత్రపుష్పం, నివేదన కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అక్షింతలు, తిరుమల లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా నలుబోలు బలరామయ్యనాయుడు, పద్మావతి, నలుబోలు కామేశ్వరరావు, భారతి, వెంకరమణారెడ్డి, శైలజలు వ్యవహరించారు. గుండాలగురవయ్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు, హరిహరనాథ్ భజన మండలి, గోదాదేవి భజన మండలికి చెందిన మహిళల కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ధార్మికమండలి కో-ఆర్డినేటర్ డా॥యం.శ్రీహరి, హిందూధర్మకర్త మండలి అధ్యక్షులు సివి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

## పనులెప్పుడు?

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్ద 60ఎకరాల భూములను విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి అప్పగించారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి యూనివర్సిటీ తరుపున ఈ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేసి రెండేళ్లయ్యింది. ఇంతవరకు నిర్మాణ పనులు మొదలుకాలేదు. ఫిబ్రవరిలో భవనాల నిర్మాణం మొదలుపెడతామని వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాజారామిరెడ్డి చెబుతున్నారు. త్వరలోనే దీనికి టెండర్లు పిలుస్తామంటున్నారు.

## బర్త్‌డే కాదు.. బ్లాక్‌డే



ఈనెల 9వతేదీ యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ జన్మదినాన్ని ఎవరిష్టం వచ్చిన రీతిలో వాళ్ళు జరుపుకున్నారు. కాంగ్రెస్‌వాళ్లు మాత్రం కేక్ కటింగ్‌లతో బర్త్‌డేలాగే జరిపితే, సమైక్యవాదులు, వివిధ పార్టీలవాళ్ళు ఆమె డెత్‌డేగా, బ్లాక్‌డేగా, సంతాపదినంగా... ఇలా రకరకాల పద్ధతుల్లో జరుపుకున్నారు. ఎన్జీఓలు, విద్యార్థి ఐకాస ఆమె జన్మదినాన్ని బ్లాక్‌డేగా పాటించాయి. విఆర్‌సి సెంటర్‌లో సోనియా దిష్టిబొమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు. తెలుగునాడు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ బెలూన్లకు సోనియాఫోటోలు అతికించి గాలిలోకి వదిలి "సోనియా పరలోకయాత్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. విక్రమసింహపురి యూనివర్శిటీలో విద్యార్థులు, అధ్యాపకులు నల్లజెండాలు, నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఇలా నగరంలో సోనియా జన్మదిన వేడుకలను కర్మదిన వేడుకలుగా నిర్వహించారు.

## విభజన బిల్లు కేసీఆర్ లబ్ధికోసమే

నెల్లూరు నగరం కెవిఆర్ పెట్రోలు బంకు సెంటర్‌లో ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరుజిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం, రూరల్ శాఖ ఆధ్వర్యంలో కెసిఆర్‌కు శవయాత్ర నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వైకాపా రూరల్ శాఖ అధ్యక్షుడు కమతం అశోక్ మాట్లాడుతూ ఒకే జాతి రెండు రాష్ట్రాలయితే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తెలంగాణ ఏర్పడితే కెసిఆర్ కుటుంబానికి మాత్రమే లాభమని, తెలంగాణ ఏమాత్రం అభివృద్ధి చెందదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మదన్‌కుమార్‌రెడ్డి, వైవి హరీష్ రెడ్డి, కడింపాటి వెంకటేష్, వి.అనిల్ కుమార్, సాయి, ఎ.చక్రధర్, దినకర్, కె.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాల నేరస్తులు దొరికారు

### రూ.6.50 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

ఎట్టకేలకు బాలనేరస్తులు పోలీసుల వలలో చిక్కారు. ఇద్దరు బాల నేరస్తులు గత కొంతకాలంగా నెల్లూరు నగరంలో చోరీలకు పాల్పడేవారు. పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని దొంగతనం చేసేవారు. దోచుకున్న బంగారం, వెండి ఆభరణాలను అమ్మి వచ్చిన నగదుతో జల్సాలు చేసేవారు. ఆ క్రమంలో ఈ నెల 7వతేదీ ఉదయం నగరంలోని చిన్న పిల్లల పార్కు సమీపంలో తిరుగుతుండగా బాలాజీనగర్ పోలీసుస్టేషన్ సిఐ మంగారావు, ఎస్సై నాగేశ్వరరావు వీరిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన స్టైల్లో విచారించగా బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోనే ఏడు చోరీలు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.6.50 లక్షల విలువైన 28.4 సవర్ల బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్ పోలీసుస్టేషన్లో డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి సిఐ మంగారావు, ఎస్సై నాగేశ్వరరావు విలేకర్లకు వివరాలు తెలిపారు. ఈ కేసును ఛేధించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

## "స్మైల్" ఉచిత దంత వైద్య శిబిరం



నెల్లూరు ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని రమేష్‌రెడ్డి నగర్‌లో గల స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాల 15వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 6న ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల అధినేత డా॥జి.కిరణ్ మాట్లాడుతూ పళ్ళు ఊడినా, తీసివేసినా వెంటనే కృత్రిమ దంతాలను అమర్చుకోవడం తప్పనిసరి అని, దవడలో పన్నులేకుంటే 25శాతం నమిలే శక్తిని కోల్పోతారని ఫిక్స్‌డ్ పళ్ళపై అవగాహన కలిగి వుండాలని వివరించారు. ప్రస్తుతం నూతన సాంకేతికతో ప్రక్క పళ్ళ సహాయం లేకుండానే ఎంతో సహజంగా దృఢంగా వుండే ఇంప్లాంట్స్ సపోర్టెడ్ టీత్, జెర్కోనియం ఫిక్స్‌డ్ పళ్ళను అమర్చవచ్చని తెలిపారు. ఈ దంత వైద్యశిబిరంలో దాదాపు 200మందికి ఉచితంగా దంతపరీక్షలు చేసి బ్రష్‌లు, పేస్టులు, మందులు పంపిణీచేసారు.

## ప్రైవేట్ బస్సులపై ఆర్టీఏ దాడులు

నెల్లూరు నగరం మినీబైపాస్ రోడ్డు ప్రాంతంలో వున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు సోమవారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్ళేందుకు సిద్ధంగా వున్న బస్సులను తనిఖీ చేసారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న మూడు ఓల్వో బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేశారు. బస్సులు ఆగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అధికారులతో, ప్రైవేట్ బస్సు ఏజెన్సీల నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. ఆర్టీఏ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణీకులను పంపడంతో గొడవ సద్దుమణిగింది. ఈ దాడుల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## కమలనాథుల్లో వెల్లివిరిసిన ఆనందం

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ రాష్ట్రాల్లో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు సిద్ధమవుతుండటంతో సింహపురి కమలనాథుల్లో నూతనోత్సాహం పొంగింది. ప్రజలిచ్చిన తీర్పుకు కమలనాథులు ముఖ్యమంత్రి పీఠాల్ని సొంతం చేసుకోవడంతో పాటు అధికార కాంగ్రెస్‌పార్టీకి తగిన గుణపాఠాన్ని చెప్పింది. రానున్న పార్లమెంటు ఎన్నికలకు సెమీ ఫైనల్‌లాంటివని, ఈ ఫలితాలపైనే పార్లమెంటు ఫలితాలు కూడా ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో బిజెపితో పాటు తెలుగుదేశం, వైసిపి నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఆదివారం నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

## ఈ రోడ్లు బాగుపడవా...

నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. వేసిన కొన్నిరోజుల్లోనే వీటికి గోతులు పడుతున్నా నెల్లూరు నగర కార్పొరేషన్ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు విమర్శించినా చలనం కనపడటంలేదని, వివిధ వార్తాపత్రికల్లో నగరంలోని రోడ్లపై ఎన్నిసార్లు వార్తలు వచ్చినా, వాటి గురించి ఆలోచించే ఓపిక, తీరిక కార్పొరేషన్ అధికారుల్లో కనపడటంలేదని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో రోడ్లన్నీ మోకాలులోతు గోతులుగా మారి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అయితే ఎక్కడికక్కడ గోతులు పడి ఇనుప సువ్వలు బైటపడి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. ప్యాచ్‌వర్క్‌ల పేరుతో అక్కడక్కడా తూతూమంత్రం పనులుచేసి వదిలేస్తున్నారు. మరునటి రోజుకు యథాప్రకారం గుంతలుపడి దర్శనమిస్తున్నాయి. సిమెంటు రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికి వదిలేశారు. నెల్లూరునగరంలో మద్రాసుబస్టాండ్, మినీబైపాస్‌రోడ్డు, సుబేదారుపేట, కన్యకల ఆసుపత్రి, ఆత్మకూరు బస్టాండు, హరనాథపురం అండర్ బ్రిడ్జిలలో ఎక్కడచూసినా నిలువెత్తు గోతులు దర్శనమిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి సిమెంటురోడ్ల ప్యాచ్‌వర్కులను పూర్తిచేయాల్సిన అవసరం వుంది.

PDF Compressor Free Version





ఈ నెల 10వ తేదీన డివిజన్ బాటలో భాగంగా వసంతోపు సెంటర్‌లో పర్యటించి మహిళల సమస్యలను తెలుసుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# పోలీసులపై పెరిగిన ఒత్తిడి

## పరుగులు తీయిస్తున్న ఎస్పీ



జిల్లా పోలీసులు ఒకే సంవత్సరంలో రెండు విభిన్న కోణాల్లో పనిచేయాల్సి వస్తుంది. ఒకరి హయాంలో చూస్తే పెద్దగా పనీపాట లేకుండా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసారు. ఇప్పుడు చూస్తేనేమో అన్నం తిన్నాక చేయి కడుక్కోవడానికి కూడా అవకాశం లేకుండా ప్రస్తుతం ఎస్పీ తరుముతున్నాడు. ప్రతి విషయంలో 'ఆన్ పేపర్' విధానాన్ని అవలంభిస్తూ పొరపాటు చేస్తే అప్పటికప్పుడు పనిష్మెంట్ ఇస్తుండడంతో జిల్లా పోలీసులు హడలిపోతున్నారు.

మొన్నటివరకు జిల్లా ఎస్పీగా రమణకుమార్ ఉండడం తెలిసిందే! జిల్లాలో శాంతిభద్రతలు ఎలా తగలబడ్డా పోలీసులు మాత్రం పెద్దగా శ్రమపడకుండా ప్రశాంతంగా గడిపారు. రమణకుమార్‌ది జాలి హృదయం. ఎదుటివాడి కష్టాన్ని తన కష్టంగా ఫీలవుతారు. ఎదుటివాడికంటే ఆయనే ఎక్కువ కన్నీళ్ళు కారుస్తాడు. పోలీసు అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకున్నా ఫర్వాలేదు. ఆయన వద్దకొచ్చి 'క్యాప్'ను పొగుడుతుంటే చాలు... వాళ్ళు డ్యూటీలో వున్నట్లే లెఖ్ఖ. జిల్లాలో పోలీస్‌శాఖను ఇలా తయారుచేసిపెట్టాడాయన.

కాని ఆ తర్వాత ఎస్పీగా వచ్చిన పి.వి.యస్.రామకృష్ణ దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పోలీసు అధికారులను కూర్చోనీయడం లేదు. నిలుచోనీయడం లేదు. తెల్లారుజాము నుండే పరుగులు పెట్టిస్తున్నాడు. ఏ స్టేషన్ పరిధిలో ఏ చిన్న నేరం జరిగినా ఎస్.ఐలను, సిఐలను వాయించేస్తున్నాడు. తప్పులు చేస్తే వెంటనే చర్యలుంటున్నాయి. అలాగని రామకృష్ణ రోడ్ల మీదకొచ్చి చించేస్తాను, ఆరేస్తాను అని ఫోజులు ఇవ్వడం లేదు. ఆఫీసులో కూర్చుని తాను పనిచేయడం కాదు, పోలీసుశాఖ చేత పనిచేయిస్తున్నాడు. అందుకే జిల్లా పోలీసు పనితీరులో వేగం పెరిగింది.

# మురికివాడల అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న వివేకా, ముంగమూరు

రాజీవ్ ఆవాజ్‌యోజన పథకం ద్వారా నెల్లూరు నగరంలోని మురికివాడల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలో రిత్విక్ లేఅవుట్‌లోని డా॥వైయస్ఆర్ కమ్యూనిటీ హాలులో విలేకర్లతో మాట్లాడారు. నగరంలో 138 మురికివాడలున్నాయని, వాటిలో 66 మురికి వాడలను రాజీవ్‌ఆవాజ్‌యోజన పథకానికి గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో రోడ్లు డ్రైనేజీ కాలువలు, మంచినీటి సౌకర్యాలతో పాటు పక్కాగృహాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తొలివిడతగా 24వ డివిజన్ పరిధిలోని సుందరయ్యకాలనీ సీ, డీ బ్లాకులు, డీ బ్లాక్‌ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికయ్యాయన్నారు. ఆయా ప్రాంతాల అభివృద్ధికి రూ.16 లక్షల నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. పక్కా గృహానికి రూ.4 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50శాతం, నగరపాలక సంస్థ 25శాతం నిధులను ఈపథకానికి కేటాయిస్తుందన్నారు. గాయత్రినగర్ నుంచి వేదాయపాళెం రైల్వేస్టేషన్ వరకు రైల్వేలైన్‌కు ఆనుకుని రూ.2 కోట్ల నిధులతో 60 అడుగుల రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మునిసిపల్ కమీషనర్ జాన్‌శ్యాంసన్ పాల్గొన్నారు.

# విజేతలైన "వాకర్స్"కు బహుమతి ప్రదానం



నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 5,6 తేదీల్లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. నడక, పరుగు, షాట్‌పుట్ పోటీలు పురుషులకు, నడక, పరుగు మ్యూజికల్ చైర్స్ పోటీలు మహిళలకు వయస్సులవారీగా జరిపి 39మంది విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. న్యాయనిర్ణేతలుగా వాదనాల నారాయణ రావు, స్వర్ణరమేష్‌బాబులు వ్యవహరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణరమేష్‌బాబు, సభ్యులు దద్దోలు రమణయ్య, పి.రవిచంద్ర, ఓబులురెడ్డి, హరికృష్ణ, వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు శేషగిరిరావు, రంగారావు, అరుణాచలం, విజయభాస్కర్‌రెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, డా॥సత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ ట్రాఫిక్ అవస్థ!

సింహపురి సమాచారం



నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలకు ఫుల్‌స్టాప్ అనేది లేకుండా పోయింది. రెండేరెండు ప్రధాన రహదారులు కావడంతో ట్రాఫిక్ అంతా ఆ రోడ్ల మీదే పోవాల్సివస్తుంది.

ఇటీవల వరకు నగరంలోని కెవిఆర్ పెట్రోల్‌బంకు నుండి జిల్లా కోర్టు వరకు పడమరవైపు వేసిన సిమెంటురోడ్డు వల్ల దాదాపు నెలరోజుల పాటు వాహనదారులు నానాయాతన పడ్డారు. అప్పుడు ఒకేవైపు ఇరువైపులా వెళ్లే వాహనాలను అనుమతించడంతో గంటలకొద్దీ ట్రాఫిక్‌జాం ఏర్పడింది. పడమర వైపు సిమెంట్‌రోడ్డు అయిపోయి ఆ రోడ్డును తెరవడంతో ట్రాఫిక్ కొంత సులభమైంది. అయితే ఇప్పుడు తూర్పువైపు కూడా సిమెంట్‌రోడ్డు నిర్మాణపనులు చేపట్టారు. మద్రాసు బస్టాండ్ వైపు నుండి దర్గామిట్ట వైపుకు వెళ్లే వాహనాలు మూలాపేట, లేదా మినీబైపాస్‌ల మీదుగా తిప్పాల్సివస్తుంది. దీంతో వాహనాల రద్దీ పెరిగి ఈ ప్రాంతాలలో కూడా ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి.



## కరెంటు కష్టాలు

# మీటరు తిరిగితే మోతే!

ప్రజలపై మళ్ళీ కరెంటు భారంపడింది పేద మధ్య తరగతి ప్రజలు కోలుకోలేని స్థితిలో విద్యుత్‌భారం మోయవలసి వస్తోంది ప్రస్తుతం పెంచిన విద్యుత్ రేట్లు చూస్తే బెంబేలెత్తాల్సిందే. 150యూనిట్లుపైన ఒక్క యూనిట్ అదనంగా కాల్చారో మటాష్, మూడురెట్లు కరెంటు బిల్లు చెల్లించుకోవల్సిందే. గతంలో 150యూనిట్లకు చేరువైతే కేవలం రూ॥320 బిల్లు వచ్చేది. తాజాగా పెంచిన విద్యుత్ ఛార్జీలతో చూస్తే 680రూ॥లు చెల్లించుకోవల్సిందే. 50యూనిట్లులోపు వాడే వినియోగదారులు ఏడాదికి 300రూ॥లు వంతున, 100యూనిట్లకు పరిమితమయిన వినియోగదారులు కూడా అదనంగా చెల్లించకతప్పదు. గతంలో 100యూనిట్లకు మించకుండా విద్యుత్‌ను పొదుపుగా వాడుకునే వినియోగదారులు తాజాగా పెరిగిన విద్యుత్‌ఛార్జీలతో ఏడాదికి అదనంగా 1800రూ॥లు భారాన్ని మోయాల్సివస్తోంది. కేవలం ఒక్క యూనిట్ ఎక్కువకాలిస్తే ఇంతే సంగతులు. పేద మధ్యతరగతి ప్రజలు చాలా జాగ్రత్తగా విద్యుత్‌ను ఉపయోగించుకోవాలి. నూతనంగా ప్రవేశపెట్టిన శ్లాబ్‌లో నుంచి మరొక శ్లాబులో పడ్డామంటే 300నుండి 800రూ॥లు పెరుగుతుంది. పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందిపెట్టేందుకే నూతన శ్లాబ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చిన్ని నారాయణరావుకు 'పినాకిని' సత్కారం



చిన్ని నారాయణరావును సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని పొందిన సందర్భంగా ప్రముఖ నెల్లూరు కవి చిన్ని నారాయణరావును లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని ఈనెల 7న గౌరవంగా సత్కరించింది. ఈ సందర్భంగా చిన్ని నారాయణరావు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సభ్యుడిగా వుంటున్న తనకు ఈ సత్కారం ఎంతో ఆనందంగా వుందని అన్నారు. త్వరలో తన నూతన కవితా సంపుటిని వెలువరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బైసాని పార్థసారథి, కార్యదర్శి బయ్యాప్రసాద్, ట్రెజరర్ టి.వి.రాంప్రసాద్, సభ్యులు బచ్చు బ్రహ్మయ్య, ఉదయభాస్కర్, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, సివికృష్ణయ్య, చిన్ని శ్రావణ్‌కుమార్, జె.వి.మురళీ, తులసి పాండురంగారావు, చెవులయుగంధర్, నారాయణ, పి.శ్రీరంగనాథ్, బైసాని అరుణ తదితరులు పాల్గొన్నారు.

# 'టిమ్'కు గుడ్‌బై చెప్పేనా?



ఆర్టీసీలో కార్మికులను క్రమబద్ధీకరించుకోవడానికి పెట్టిందే 'టిమ్'(టిక్కెట్ ఇష్యూ మిషన్). ఆర్టీసీ బస్సులో డ్రైవర్, కండక్టర్ ఇద్దరు ఉంటారు. అయితే దూరప్రాంత సర్వీసులకు డ్రైవరే కండక్టర్ బాధ్యతలను కూడా నిర్వర్తించాల్సి వుంటుంది. దీనికిగాను డ్రైవర్‌కే 'టిమ్' ఇస్తారు. ప్రయాణీకులు ఎక్కేటప్పుడే డ్రైవర్ టిక్కెట్లు కొట్టేస్తాడు.

అయితే డ్రైవర్ విధులతో పాటూ కండక్టర్ విధులు నిర్వహించడం కష్టంగా వుందని కొందరు కోర్టుకు వెళ్లడం జరిగింది. డ్రైవర్‌తో పాటు కండక్టర్ డ్యూటీ కూడా చేయాలని బలవంతం చేయొద్దని హైకోర్టు సింగిల్‌బెంచ్ జడ్జి ఆదేశించారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం ఈ తీర్పు పట్ల సంతృప్తిగా లేదు. అసలే సంస్థ నష్టాల్లో ఉంది. కార్మికులను సద్వినియోగం చేసుకుంటేనే సంస్థ గట్టెక్కగలదనేది వారి అభిప్రాయం. వాస్తవానికి స్టాపింగ్‌లు ఎక్కువగా వుండే బస్సులకు ఖచ్చితంగా డ్రైవర్‌తో పాటు కండక్టర్ కూడా వుండాలి. ఎందుకంటే అయిదారు కిలోమీటర్లకు ఒక స్టాపింగ్ వచ్చే రూటులో డ్రైవరే టిక్కెట్లు కొట్టలేడు. కాబట్టి కండక్టర్ ఆ డ్యూటీ చేయాలి. జిల్లా పరిధిలో తిరిగే బస్సులు, దగ్గరదగ్గర ప్రాంతాలకు తిరుగుతూ ఎక్కువ స్టేజీలున్న బస్సులకు కండక్టర్లు తప్పనిసరి. కాని నాన్‌స్టాప్ బస్సులకు కండక్టర్ల అవసరం పెద్దగా వుండదు. బయలుదేరిన బస్టాండ్ లేదా ఆ పట్టణం పరిధిలో మాత్రమే టిక్కెట్లు కొట్టే పని వుంటుంది. ఉదాహరణకు నెల్లూరు–తిరుపతి నాన్‌స్టాప్ బస్సులు తీసుకుంటే నెల్లూరు దాటేదాకే టిక్కెట్లు కొట్టే పని. ఆ తర్వాత నాయుడుపేట బస్టాండ్‌లో ఓ అయిదునిముషాలు ఆగి టిక్కెట్లు కొట్టొచ్చు. కాబట్టి ఇలాంటి సర్వీసుల్లో 'టిమ్'కు ఇబ్బంది లేదు. అలాగే చెన్నై, ఒంగోలు, కడప వంటి ప్రాంతాలకు వెళ్లే బస్సులకు స్టాపింగ్‌లు ఎక్కువగా వుంటాయి కాబట్టి కండక్టర్ వుండడం అవసరం. బెంగుళూరు, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం వంటి దూరప్రాంతాలకు వెళ్ళే సర్వీసులలో 'టిమ్'తో పాటు ఇద్దరు డ్రైవర్లు ఉంటే అసలు రిస్కే వుండదు.

PDF Compressor Free Version



# గాంధీ ఆశయం ప్రకారమే కాంగ్రెస్ భూస్థాపితం

గల్పిక

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్‌థర్టీకల్లా నిద్రలేచాడు. వెంటనే బాత్‌రూంకెళ్లి కాలకృత్యాలు ముగించుకుని నాలుగుప్లేట్లు పూరి, రెండు ప్లేట్లు ఉప్మా, ఐదుసాదాదోశె ఆర్డర్ చెప్పాడు. ఆరోజు నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఉండడంతో టీవీ ఆన్ చేసాడు. అన్ని టీవి ఛానెల్స్ లోనూ ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. ఆ ఇంట్రెస్ట్‌తో ఆయన పెద్దానువత్రికి వెళ్లేపనిని మర్చిపోయాడు. ఇలా మధ్యాహ్నం అయ్యేసరికి మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఢిల్లీ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమైంది. ఆ సంతోషంతో విక్రమార్కుడు రెండుబీర్లు ఆర్డర్ చేసాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకోవడంతో కాంగ్రెస్ అంటే విక్రమార్కుడికి మంటగానే వుంది. కాబట్టే ఆయన కాంగ్రెస్ ఓటమిని బీర్లు తాగుతూ ఎంజాయ్ చేయాలనుకున్నాడు. అంతలో విక్రమార్కుడి రూమ్ కాలింగ్‌బెల్ మోగింది. విక్రమార్కుడు లేచి తలుపుతీసాడు. అక్కడచూస్తే భేతాళుడు. కోపంతో... ఏం విక్రమార్క.. ఈరోజు డ్యూటీనే ఎగ్గొట్టావ్... ఏంటి సంగతులన్నాడు. విక్రమార్కుడు టీవీలలో వస్తున్న ఎన్నికల ఫలితాలను చూపిస్తూ... సోనియాగాంధీ, రాహుల్‌లకు బద్ధోస్తుంది... అని అన్నాడు. ఆ మాటకు భేతాళుడు... విక్రమార్క సోనియా, రాహుల్ గాంధీలను నువ్వు తప్పుగా అర్థం చేసుకుంటున్నావు. వాళ్ళు ఏది చేసినా మంచికోసమే. ఈ ఎన్నికల ఫలితాలు చూసి వాళ్ళు బాధపడేదేమీ వుండదన్నాడు. ఆ మాటకు విక్రమార్కుడికి భలే ఆశ్చర్యమేసింది. ఏంటి భేతాళ... అలా అంటావు. ఈ ఫలితాలు చూస్తే టీము, నెత్తురు వుండేవాళ్లెవరయినా సిగ్గుపడతారని అన్నాడు. నీకు మాటల్లో అర్థం కాదుగాని, లైవ్‌లో చూపిస్తానుండు అంటూ భేతాళుడు ల్యాప్‌టాప్ తీసి టెన్‌జనపథ్ యాహుడాట్‌కామ్ వెబ్‌సైట్ ఓపెన్‌చేసాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

అది ఢిల్లీలోని టెన్‌జనపథ్... అప్పటికే నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ముగిసి కాంగ్రెస్ చాప చుట్టడం అయిపోయింది. సోనియాగాంధీ, రాహుల్‌ను పరామర్శించి ధైర్యం చెబుదామని కాంగ్రెస్ అగ్రనేతలు ఒక్కొక్కరుగా అక్కడకు చేరుకుంటున్నారు. ముందుగా షీలాదీక్షిత్ వచ్చింది. ఆమె వస్తున్న ఏడుపును అదిమి పట్టింది. లోపలకు పోకుండానే గేటుముందు నిలబడి... ఈ ఓటమి స్వయంకృతాపరాధమమ్మా.... రాహుల్ ఇమేజ్ వుండబట్టే ఆ 8సీట్లన్నా వచ్చాయి. లేకుంటే అవి కూడా రావు. అని తనలో తాను మాట్లాడుకుంటూ సోనియా ముందు ఎలా మాట్లాడాలో రిహార్సల్ చేయసాగింది. ఆ తర్వాత అశోక్‌గెహ్లాట్ వచ్చాడు. ఆయన కూడా గేటు ముందు నిలబడి సోనియాతో ఏం మాట్లాడాలనే దానిపై ప్రిపేర్ అవుతూ... మా చేతకానితనం వల్లే రాజస్థాన్‌లో ఓడిపోయాం... అక్కడ 21సీట్లన్నా వచ్చాయంటే అది రాహుల్ బాబు పుణ్యమే. అని రిహార్సల్ చేసాడు. ఆ తర్వాత జ్యోతిరాదిత్య సింధియా, అమిత్‌జోగిలు కూడా అక్కడకు వచ్చారు. వాళ్లు కూడా అదే రీతిలో రిహార్సల్ చేసారు. ఆపై గులాంనబీ ఆజాద్, చిదంబరం, దిగ్విజయ్‌సింగ్, ఆంటోని, జైపాల్‌రెడ్డి, అంబికాసోని, మనీష్ తివారి వంటి కాంగ్రెస్ సీనియర్లంతా అక్కడకు వచ్చారు. టెన్‌జనపథ్‌లోకి వెళ్లే ముందు వీళ్లందరినీ ఉద్దేశించి దిగ్విజయ్‌సింగ్... ఈ ఫలితాలు చూసి మేడమ్, రాహుల్‌బాబులు చాలా నిరాశకు గురయ్యుంటారు. నాకు తెలిసి వాళ్లు వెక్కిళ్లు పెట్టి ఏడుస్తుండొచ్చు కూడా! మనమంతా వెళ్ళి వారిని ఓదార్చాలి. ఈ నాలుగు రాష్ట్రాల ఓటమికి వాళ్లు కారణం కాదని చెప్పాలి. ప్రజల దరిద్రం కొద్దీ మనం ఓడిపోయామని, ఇందులో స్థానికంగా మన నాయకత్వాల వైఫల్యం వుందని చెప్పాలి. కాంగ్రెస్ ఎక్కడన్నా ఓడిపోతే అది మన ఖాతాలోకి, కాంగ్రెస్ ఎక్కడన్నా గెలిస్తే అది రాహుల్ ఖాతాలోకి జమచేస్తున్నాం కదా... ఈ ఓటములను కూడా మన ఖాతాలోకే వేసుకోవాలి. 2014 ఎన్నికలలో రాహుల్ నాయకత్వమే మనల్ని గెలిపిస్తుందని అమ్మకి, బాబుకి ధైర్యమివ్వాలని నూరిపోసాడు. అందరూ అలాగేనని లోపలకు వెళ్లారు. కాని అక్కడ కనిపించిన సీన్‌కు వీళ్లంతా ఒక్కసారిగా షాకయ్యారు. అక్కడ గాంధీజీ చిత్రపటం ముందు నిలబడి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ఒకరికొకరు ఆనందంతో స్వీట్లు తినిపించుకుంటున్నారు. ఈ సీన్ చూసిన కాంగ్రెస్ నేతలు నోట మాట రాక అలాగే నిలబడిపోగా... వీరిని చూసిన రాహుల్.. రండి రండి... మంచి సంతోష సమయంలో వచ్చారు. వచ్చి మీరు కూడా స్వీట్లు తినండి అని చెప్పాడు. ఆ మాటకు వీళ్లంతా నోరెళ్లబెట్టారు.

ఇక్కడితో ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద సీన్‌లు అయిపోయాయి. భేతాళుడు ల్యాప్‌టాప్ మూసేసి... విక్రమార్క ఇప్పుడు చెప్పు... నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో తీవ్రంగా నిరాశ చెందాల్సిన సోనియా, రాహుల్‌లు గాంధీ పటం ముందు నిలబడి సంతోషంగా స్వీట్లు ఎందుకు తింటున్నట్లు? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసినా, తెలియకపోయినా చెప్పాల్సిందే. చెప్పకపోయావో రెండుకళ్ల సిద్ధాంతంతో అటు ఇటు కాకుండా పోయిన చంద్రబాబు లాగా అవుతుంది నీ పరిస్థితి అని హెచ్చరించాడు. దానికి విక్రమార్కుడు... వాళ్లు గాంధీ చిత్రపటం వద్ద స్వీట్లు తినడంతోనే సీన్ అర్థమవుతుంది భేతాళ... దేశానికి స్వాతంత్ర్యం రాగానే కాంగ్రెస్‌పార్టీని రద్దుచేయాలని గాంధీ కోరారు. కాని దానిని నెహ్రూ నుండి రాజీవ్ వరకు ఎవరూ రద్దు చేయలేదు. గాంధీ ఆశయం అలాగే ఉండిపోయింది. గాంధీ ఆశయాలలో ఒక్కటన్నా సాధించాలనుకున్నాడు రాహుల్‌గాంధీ. అందుకే పెండింగ్‌లో వున్న కాంగ్రెస్ రద్దును ఎంచుకున్నాడు. కాంగ్రెస్‌పార్టీని ఒక్కసారిగా రద్దు చేస్తే అందులోని నాయకులు ఒకేసారి రోడ్డుమీద పడతారని జాలిచూపి పార్టీని కొంచెంకొంచెంగా భూస్థాపితం చేసుకుంటూ వస్తున్నాడు. ఈ నాలుగు రాష్ట్రాల ఫలితాలతో ఆ ప్రక్రియ మరింత ముందుకు జరిగింది. గాంధీ ఆశయసాధనకు చేరువ అయ్యామనే ఆనందంతోనే సోనియా, రాహుల్‌లు స్వీట్లు తిన్నారని చెప్పాడు. ఆ సమాధానంతో తృప్తి చెందిన భేతాళుడు అప్పుడే బేరర్ తెచ్చిన రెండు బీర్‌బాటిళ్లను లాక్కుని ఎస్కేప్ అయ్యాడు.

# అలుపెరుగని అక్షర సైనికుడు అద్దేపల్లి



అద్దేపల్లి ఓ మెరుపుపువ్వు. పసివాడని కవిత్వపు నవ్వు. నిత్యం గోదావరిలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ, సరికొత్త అందాలతో కన్పించే నిత్య యౌవనుడు, ఏడు పదుల జీవితాన్ని, అర్థశతాబ్దపు కవిత్వాన్ని గుండె జెండాగా ప్రతిష్ఠించుకుని సాగుతున్న అలుపెరుగని అక్షర సైనికుడు.

చాలా మంది కవిత్వాన్ని, జీవితాన్ని వేరుగా చూస్తారు. అద్దేపల్లికి రెండూ ఒకటే! వారి జీవితం నుంచి కవిత్వాన్ని, కవిత్వం నుంచి జీవితాన్ని వేరు చేయలేం. కవిత్వమే జీవితశ్వాసగా బతికిన నిబద్ధకవుల పక్కన అద్దేపల్లి నిలుస్తారు. సీనియర్ కవుల్ని ప్రేమించడం, జూనియర్ కవుల్ని ప్రోత్సహించడం అద్దేపల్లి అరుదైన వ్యక్తిత్వం. మంచి కవిత్వాన్ని హత్తుకునే సహృదయులు కాళ్ళకు చక్రాలు కట్టుకుని, ఊరూరా తిరిగి కవిత్వ గింజల్ని వెదజల్లి, కొత్త పంట కోసం ఎదురుచూసే కవిత్వ ప్రేమికుడు.

అద్దేపల్లి కాలం వెంట నడిచిన కవి తొలినాళ్ళలో కాల్పనిక కవిత్వంతో ప్రభావితుడై పద్యాల్లో సేద్యం చేసి 'మధుజ్వాల'గా మొలకెత్తారు. అనంతరం అంతుర్ముఖుడై, మార్గాన్ని మార్చుకున్నారు. ఈ దశలో శ్రీశ్రీని ఆరాధించినా ఆధునిక కవుల్ని అనుసరించినా, సొంత గింజలతో సేద్యం చేశారు.

"అక్కడ పిల్లలు తుపాకీ గొట్టంతో/అఆలు రాస్తున్నారు"

"గోదావరి నీళ్ళు దోసిట్లోకి తీసుకుంటే/ తెలుగు సంస్కృతి ప్రతిబింబిస్తుంది"

వంటి పాదాలపై అద్దేపల్లి కవిత్వ ముద్ర కన్పిస్తుంది. అద్దేపల్లి కవిత్వంలో సామాజిక వేదన అంతఃస్సూత్రంగా వుంటుంది. "ప్రపంచం బాధను తనబాధగా చేసుకున్న శ్రీశ్రీమార్గాన్నే అద్దేపల్లి అనుసరిస్తున్నారు. అద్దేపల్లి కవితలు చదివిన వారు ఆయన్ను హ్యూమనిస్టు, విప్లవవాది అనుకుంటారు. కాని ఆయన భావ విప్లవవాది. సామాజిక చైతన్యం కవిత్వపరమార్థం కావాలన్నది అద్దేపల్లి ఆశయం. సమకాలీన సాహిత్యోద్యమాలన్నింటినీ ఆహ్వానించారు. అభ్యుదయతత్వాన్ని స్వీకరించారు. ప్రతిఘటన చైతన్యాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్ళారు.

కవిత్వం పరిణాత్మకంగా కంటే, గుణాత్మకంగా వుండాలన్నది అద్దేపల్లి ధ్యేయం. ప్రపంచీకరణతో గ్రామాల్లోకి చొచ్చుకు వచ్చిన మార్కెట్ మాయాజాలాన్ని, వస్తుసంస్కృతిలో మనిషి, మానవత్వం మాయమవుతున్న తీరును ప్రతిభావంతంగా చెప్పిన కవుల్లో అద్దేపల్లి ఒకరు. వారికలమేకాదు గళమూ నిర్భయంగా సాగుతుంది.

"దేశం తలఎత్తితే ఆకాశం తగలాలి, దేశం చెయ్యి చాస్తే సూర్యబింబం అరచేతిలో నిలవాలి" అనగలిగిన సృజనాత్మకత అద్దేపల్లి సొంతం. కవిత్వంలో చక్కదనం కంటే చిక్కదనం ముఖ్యమనే అద్దేపల్లి వందలాది యువకవుల్ని కొత్తదనం వైపు మళ్ళించారు. పీఠికలు రాసి ప్రోత్సహించారు. ముందు మాటలు రాసి ముందుకు నడిపారు. ఇవాళ ఆంధ్రదేశంలో ఏ ఊరు వెళ్ళినా ఓ డజను మంది అద్దేపల్లి అభిమానులుంటారు. ఈ అదృష్టం తెలుగు కవుల్లో ఓ నాగభైరవకు, ఓ శివారెడ్డికి దక్కింది. సభలు, సమావేశాలు అద్దేపల్లి శ్వాస. ఆయనో కదిలే కవితా ప్రవాహం. నిత్యసాహిత్యసంచారి. అద్దేపల్లి వయస్సు 77సం॥ అయినా ఆయన ముదురు కవికాదు, చిగురుకవి. ముఖంలో కాస్తంత ముసలితనం తొంగిచూస్తున్నా, కవిత్వంలో మాత్రం యౌవనపు సొగసుల్ని అద్దుతున్న ఏకైక కవి అద్దేపల్లి. కొంతమంది కొంతకాలం రాసి, రాసిందాంతో తృప్తి పడతారు. మరికొంతమంది నిరంతరం రాస్తున్నా, నిర్జీవులుగా వుంటారు. ఇంకొందరు రేపటి కోసం రాస్తారు. గతాన్ని గమనిస్తూ, వర్తమానాన్ని అభిముఖం చేస్తారు. అద్దేపల్లి వారు మూడోకోవకు చెందిన కవి. ఆయన కవిత్వం రాసినా, విమర్శ చేసినా నిలువెత్తు నిబద్ధతతో సాగుతారు. "అభ్యుదయ, విప్లవ కవిత్వాలు, సిద్ధాంతాలు, శిల్పరీతులు" అన్న వారి సిద్ధాంత వ్యాసం ఆధునిక తెలుగు సాహిత్యానికి సాధికార వ్యాఖ్యానం అలాగే "శ్రీశ్రీకవితా ప్రస్థానం" మహాప్రస్థానానికి తొలి విశ్లేషణాత్మక రచన. అద్దేపల్లి రామమోహనరావు కాలం వెంట నడిచే కవి, కదిలే కవి, కదిలించే కవి. పెన్నుతో సమాజాన్ని వెన్ను తడుతున్న కవి. "పాట గొంతులోంచి కాదు, జీవితంలోంచి రావాలి" అనే అద్దేపల్లి ఓ నిశ్శబ్ద విస్ఫోటనం. చిరునామా ఉన్న కవితా సముద్రం. ఓ అక్షరరేఖా చిత్రం. సహజంగా కవుల్లో వుండే అహంభావం, ఈర్ష్య, అసూయ మచ్చుకైనా కానరావు. ఓపెన్‌హార్ట్‌తో నడిచే కవి. ఆంధ్రదేశమంతా ఆయన కౌలుకు తీసుకున్న నేలలో కవితాసేద్యం చేస్తూనేవున్నారు.

"ధాన్యంపురుల మీద రైతుసంతకం చెరిగిపోయిన తర్వాత ఇల్లంతా చెరిగిపోయిన తెలుగు పుస్తకమవుతుంది." అంటున్న అద్దేపల్లి రాత్రికి సేదతీరి, సూర్యోదయంలా నిద్రలేస్తారు. "కాలంమీద చెరగని సంతకం" చేస్తారు. అద్దేపల్లి రామోహనరావు మాత్రం మనతరానికి అవసరమైన నిరంతరకవి, కవిత్వకాంతితో భాసించే నిత్య ప్రభాతరవి. ఇది అక్షరసత్యం.

(ప్రఖ్యాతకవి డా॥అద్దేపల్లి రామమోహనరావుగారికి ఈనెల 15న నెల్లూరులో నాగభైరవ అవార్డు ప్రదానం చేస్తున్న సందర్భంగా)

- డాక్టర్ జిరం సుందరరావు
9848039080

## కదంబం

### భావప్రతీకలు

అద్దేపల్లి రామమోహన్‌రావు,
కాకినాడ. 9849150303.

నీ రెండు చేతులూ అటూ ఇటూ
రెండు కొమ్మలమీదికి చాచి
మానుకి క్రీస్తులాగా ఆనుకుని నిలబడి
చూపుల్తో పచ్చదనాన్ని ఒంటినిండా పూసుకో
నీ తల చుట్టూ శాంతి పావురాలు
గుడి కట్టి పరిభ్రమిస్తే
వానకురిసి వాననీళ్ళలో తడిసిన పసిపిల్లలు
నీళ్ళలో పడవల్ని వదిలినప్పుడు
ఒక పడవలో పయనించి
బాల్యం స్టేషన్‌కి చేరుకో
మబ్బులు నీమీద ముత్యాల గొడుగు పడతై
నీ బతుకు నిండా కొత్త చిగుళ్ళు మెరిసిపోతై
మధుప్రాతలోంచి
ఒళ్ళు విరుచుకుంటూ సాకీ లేచి నిలబడినప్పుడు
నీ రక్తబిందువులతో
గజల్ తయారు చేసి అభిషేకించు!
నువ్వు యువకుడివైతే
యౌవనం ఇంకా బలపడుతుంది
నీకు యౌవనం దాటిపోతే
మళ్ళీ తిరిగొస్తుంది.

# డ్రగ్ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

## పట్టుబడ్డ నెల్లూరు జిల్లా నిందితులు

సైబరాబాద్ పోలీసులు భారీ డ్రగ్ రాకెట్ ముఠాను పట్టుకుని వారి నుంచి 56 కిలోల నార్కోటిక్స్, రూ.7 లక్షల నగదు, ఓకారు, 5 సెల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు. 7వ తేదీ విలేకర్లకు సైబరాబాద్ ఓయస్‌డి, ఎస్ఓటి కె.గోవర్ధన్ వివరాలు తెలిపారు. నల్గొండ జిల్లా మెటపల్లి మండలం, చేటపల్లి గ్రామానికి చెందిన బొబ్బా క్రిష్ణారెడ్డి కుమారులు బొబ్బా వెంకటరెడ్డిలు లింగంపల్లిలో కాపురముండేవారు. వీరికి అనేక కెమికల్ ఫ్యాక్టరీల్లో పని చేసిన అనుభవం వుంది.

వీరి స్నేహితుడు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం, వరికుంటపాడు గ్రామానికి చెందిన తిరుమల విజయ్‌కుమార్‌రెడ్డి(48) నగరంలో అమీర్‌పేట ప్రాంతంలో ఉండేవాడు. వీరు ముగ్గురు కలిసి డ్రగ్ సరఫరా వ్యాపారం చేసేవారు. శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి ఇరువురు కలిసి ముంబాయి లోని జావెద్ అనే వ్యక్తి నుంచి ముడి పదార్థాన్ని డ్రగ్స్‌గా మారుస్తారు. అనంతరం దీన్ని విజయ్‌కుమార్ చెన్నైలో ఉండే కొందరు వ్యక్తులకు సరఫరా చేస్తాడు. ఆ క్రమంలో చందానగర్ పోలీస్‌స్టేషన్ సిఐ వాసు సహకారంతో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ బృందం కలసి వలపన్ని వీరిని పట్టుకున్నారు.

# చీటీల డబ్బుతో మహిళ పరార్

- కోటి రూపాయలతో కుచ్చుటోపి
- ఆమె ఇంటి వద్ద ఆందోళనలకు దిగిన బాధితులు

నమ్మించి, అందరితో ఆప్యాయంగా నటించి దాదాపు కోటి రూపాయలతో ఓమహిళ పరారైన సంఘటన ఇటీవల వెలుగు చూసింది. నెల్లూరు నగరం గాయత్రినగర్ 2వ వీధిలో పి.మధుసూదన్‌రెడ్డి, భవానీ దంపతులు ఓఇంట్లో బాడుగకు ఉంటున్నారు. మధుసూదన్‌రెడ్డి బియ్యం వ్యాపారం చేసేవాడు. దంపతులు చీటీలు వేసి పాడుకుని సకాలంలో నగదులు తిరిగి చెల్లించి బాగా నమ్మకం కలిగించారు. ఈనేపథ్యంలో భవానీ చీటీలు వేయడం ప్రారంభించింది. లక్ష, మూడు లక్షలు, అయిదు లక్షలు చీటీలు వేసింది. ఆమెపై నమ్మకంతో ఇరుగుపొరుగు మహిళలు లక్షల్లో చీట్లు వేసారు. ఈ చీటీల్లో చాలామంది సభ్యులుగా చేరారు. చీటీలు పాడుకున్న డబ్బును పాడుకున్నవారికి ఇచ్చేది కాదు. కొంత తన వద్ద ఉంచుకుని మిగతా చీటీలకు నెలసరి వాయిదాలు కడతానని, సర్దుబాటుకు అవసరమని చెప్పేది.

ఆమెపై నమ్మకంతో చీటీపాటదారులు అంగీకరించేవారు. ఇంకో ప్రక్క లక్షల్లో చేబదులు తీసుకుంది. మరికొందరి వద్ద బంగారు నగలు తీసుకుని ఆమె పేరుపైనే కుదువ పెట్టుకుంది. ఇలా సుమారు కోటి రూపాయలు పైగా వసూలు చేసి మూడు నెలలు క్రిందట ఇంటికితాళాలు వేసి భర్తతో సహా ఎక్కడికో వెళ్ళిపోయింది. దీంతో 7వ తేదీ భవానీ ఇంటి వద్దకు కొందరు మహిళలు చేరుకుని ఆందోనలకు దిగారు. బాధితులు జీవి ప్రసాద్, రత్నకుమార్, శకుంతల, శైలజ, సురేష్, లక్ష్మి, జీవి నరేష్, షబీనా తదితరులు 5వ నగర పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏప్రిల్‌లో అత్యంత వైభవంగా మహాలక్ష్మియాగం


## త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామి

లోక కల్యాణార్థం సకలశుభాలు కలగాలని కులమత వర్గ రహితంగా శ్రీమహాలక్ష్మి యాగాన్ని అత్యంత వైభంగా 2014 సంవత్సరం ఏప్రిల్ నెల 7 నుండి 14వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని ఏసి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అనంత శ్రీవిభూషిత శ్రీత్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరు స్వామి పేర్కొన్నారు. ఆదివారం మాగుంట లేఅవుట్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీస్వామిజీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో శ్రీమహాలక్ష్మి యాగం వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. 15వ శ్రీమహాలక్ష్మియాగాన్ని వచ్చే ఏప్రిల్ నెలలో పాల సముద్రంలో అమ్మవారు జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5 రోజులు పాటు జరిగే ఈ యాగంలో ఒక్కొక్కరోజు ఒక్కొక్క యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీరేందుకు, సంతానం లేని వారికి పుత్రకామేష్టియాగం, గ్రహభావాలు, పితృదేవతల కొరకు, సుదర్శన యాగాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమ అర్చన, లక్ష తులసీ అర్చన నిర్వహిస్తారు. రెండున్నర లీటర్ల పాలతో అమ్మవారి ప్రతిమ సువర్ణ పుష్పా లతో యాగాలను నిర్వహిస్తున్నారు. మహాపూర్ణకుంభం, లక్ష్మీనారాయణ కల్యాణం, 250 ముత్యాలతో అమ్మవారికి అర్చన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తునామన్నారు.

ఆ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16వ లక్ష్మీ యాగాన్ని తిరుపతిలో నిర్వహిస్తున్నామన్నారు. శ్రీమహాలక్ష్మి యాగం ఆహ్వాన సమితికి గౌరవ్యాధ్యక్షులుగా ఆనం వివేకానందరెడ్డి, అధ్యక్షులుగా లక్ష్మీనారాయణరెడ్డి వ్యవహరిస్తున్నామన్నారు.


### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆర్థిక సమస్యలు, ఉద్యోగ సమస్యలు ఆందోళన కలిగిస్తాయి. వృత్తి జీవనం గలవారికి కొంత మేలుగా ఉంటుంది. ఖర్చులు కొంత ఎక్కువే ఉంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు జరగడం, వస్తువులు ముఖ్య పత్రాలు పోగొట్టుకొనే స్థితి ఉన్నది. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు సంప్రదింపులు జరుపుతారు.


### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తివ్యాపారాలలో కొంత స్తబ్దత ఉండినా ఆదాయం ఫరవాలేదు. అనుకున్న పనులను విజయవంతంగా నెరవేరుస్తారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుండగలవు. ఉపాధి పథకాలను నిలద్రొక్కుకుంటారు. ఉద్యోగ వ్యాపారులపై అధికారుల దాడులుండవచ్చును. షేర్లు పెట్టుబడులమీద లాభాలుంటాయి. ఇతరుల విషయాలలో తల దూర్చడం చేయకండి. క్రొత్త వస్తువులు కొంటారు.


### మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త ఆలోచనలు, పథకాలతో ప్రయత్నాలు జరుపుతారు. వ్యాపారాలలో అడ్డంకులు దాటుకొని ఆదాయం పెంచుతారు. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. దూరప్రయాణాలు అనుకోకుండా ఏర్పడటం జరుగుతుంది. ఆర్థిక, సామాజిక వ్యవహారాలలో మొగమాటానికి పోయి ఇబ్బంది పడే పరిస్థితి ఉన్నది, కాబట్టి జాగ్రత్త అవసరం. వాహన రిపేర్లు జరుగుతాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

మీ ఆలోచనలు ప్రణాళికలు మంచి ప్రయోజనాన్ని కలిగిస్తాయి. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి ఆదాయముంటుంది. స్థిరాస్తుల లావాదేవీలకు వనరులు సమకూర్చుకొంటారు. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉండండి. కుటుంబ ఖర్చులు బుధ, గురువారాలలో పెరుగుతాయి. సెన్సెక్స్ లాభాలనందిస్తుంది. కోర్టు కేసులలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది.



బ్రహ్మశ్రీ
స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 13.12.2013 నుండి తేది. 19.12.2013 వరకు**

ఈ వారం మేషంలో కేతువు, మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, మిధునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, మకరంలో శుక్రుడు, వృశ్చికంలో బుధ సూర్యులు. 16 తేదీ నుండి రవి ధనుస్సులో ఉంటారు.

### పంచాంగము

తేది 16 సోమవారం నుండి ధనుర్మాస ప్రారంభము. కాని ధనుర్మాసము శూన్యమాసముకాదిప్పుడు.

### ముహూర్తములు

తేదీ 13 శుక్రవారం ఉదయం గంట 9.00 నుండి గంట 10.30లోగా వివాహ వ్యాపార గృహారంభ విద్యారంభాలకు మకరలగ్నము.


### మార్గశీర్ష మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | ఏకాదశి | ఉ॥గం.10.15వ॥ |
| తేది. 14 | శని | ద్వాదశి | ఉ॥గం.10.20వ॥ |
| తేది. 15 | ఆది | త్రయోదశి | ఉ॥గం.10.52వ॥ |
| తేది. 16 | సోమ | చతుర్దశి | ఉ॥గం.11.54వ॥ |
| తేది. 17 | మంగళ | పూర్ణిమ | ప॥గం.1.24వ॥ |

### మార్గశీర్ష మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | బుధ | పాడ్యమి | సా॥గం.3.15వ॥ |
| తేది. 19 | గురు | విదియ | సా॥గం.5.20వ॥ |

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి పరంగా వ్యాపకం, రాబడి, వాణిజ్య వర్గాలకు అభివృద్ధి అవకాశాలు ఆదాయం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, క్రయవిక్రయాలలో జాగ్రత్త అవసరం. వ్యవహారాలు, సంప్రదింపులలో విజ్ఞత ప్రదర్శిస్తారు. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్తపడాలి. పరోక్షంగా మీపై విమర్శలు కొందరు చేస్తారు. ప్రముఖులను కలుసుకొనడం, చర్చలు జరపడం చేస్తారు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ వ్యవహారాలలో అసంతృప్తి, మీపై విమర్శలుంటాయి. వృత్తివ్యాపార రంగాలలో ఆదాయము పెరుగుతుంది. అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగుల కార్యక్రమాలు సాఫీగా సాగిపోతాయి. ఘర్షణాత్మకంగా ప్రవర్తించవచ్చును. అనుకోని ఖర్చులు పైనబడగలవు. కోర్టు కేసులందు అనుకూలత, ప్రభుత్వ అనుమతులు ఋణాలు పొందుతారు. ఒక ముఖ్య సమస్య రాజీకి రావచ్చును.


### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

చేయదలచిన పనులు, వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. వృత్తి వ్యాపార వర్గాలకు మంచి ఆదాయము పెరుగుతుంది. అయితే ముఖ్య పనులకు ఋణాలు చేయవలసి రావచ్చును. పనుల వత్తిడి వలన ఆందోళన ఉంటుంది. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. పరిశ్రమలు, కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతులు లభించగలవు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిర్ణయాలు తీసుకొనినా, మాట్లాడేటప్పుడు జాగ్రత్త పడండి. ఆశించిన తీరులో ఆర్థికస్థితి ఈవారం ఉండదు. ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడిపై అసంతృప్తి ఉంటుంది. షేర్లు పెట్టుబడుల మీద లాభాలుంటాయి. అనవసర జోక్యములు వదలండి. యజమానులకు వర్కర్లతో సమస్యలు ఏర్పడ వచ్చును. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడవచ్చును.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఈ వారంలో వృత్తి వ్యాపారాలలో క్రమంగా ఆదాయం పెరుగుతుంది. భవిష్యత్తులో లాభాల కోసం పెట్టుబడులు పెట్టుతారు. వృత్తిపరంగా కొత్త పరిచయాలు పరిశోధనలుంటాయి. సేవాసాంకేతిక క్రీడా కళా రంగాలలో వారికి మంచి అభివృద్ధి అవకాశాలు దొరకగలవు. షేర్ మార్కెట్ లాభాలలో ఉంటుంది. ఉద్యోగులకు అధికారులతో సమన్వయం కుదురుతుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అడపాదడపా ఖర్చులు పెరిగినా ఆర్థికంగా పెద్ద ఇబ్బందులుండకపోవచ్చును. వృత్తివ్యాపారాలలో వ్యాపకం, ఆదాయము బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. షేర్లు పెట్టుబడుల మీద ఆదాయము ఉంటుంది. అనవసరమైన ఇతరుల విషయాలలో జోక్యం చేసుకొనడం వద్దు. కొత్త కాంట్రాక్టులు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలు లభించవచ్చును.


### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ముఖ్యమైన విషయాలను ఇతరులకు తెలుపవద్దు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాల జోలికి వెళ్లవద్దు. ఇబ్బందులు కలుగుతాయి. వ్యాపారములు మరుకుగాసాగుతు ఆదాయాన్ని పెంచుతారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగులకు పనివత్తిడి పెరుగుతుంది, మరియు శ్రమ ఉంటుంది. సెన్సెక్స్ కొద్ది లాభాలనందిస్తాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

రావలసిన బాకీలు కొంతమేరకు లభించగవు. చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. స్థిరాస్తులలావాదేవీల మీద దృష్టిపెట్టి నిర్ణయాలు తీసుకొంటారు. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. విద్యార్థులకు విద్యాప్రగతి బాగుంటుంది.

# ఆన్‌లైన్‌లోనే బ్రిటన్ వీసా రుసుము

బ్రిటన్ వీసా కావాలని కోరుకునే భారతీయులంతా ఇకపై క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లోనే వీసా రుసుము చెల్లించాల్సి వుంటుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న నగదు లేదా డిడిలను మున్ముందు అనుమతించారు. కొత్త పద్ధతి డిసెంబర్ 16 నుంచి అమల్లోకి వస్తుందని బ్రిటన్ ఇమిగ్రేషన్ ప్రాంతీయ(మధ్య, దక్షిణాసియా) సంచాలకులు థామస్ గ్రెగ్ తెలిపారు. వీసా దరఖాస్తుల ప్రక్రియను గాడిలో పెట్టే ప్రయత్నాల్లో భాగంగానే ఈవిధానాన్ని తీసుకొచ్చామన్నారు. అయితే డిసెంబర్ 16కు ముందు ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసిన వారు మాత్రం జనవరి 14 వరకు ప్రస్తుత చెల్లింపు పద్ధతులనే పాటించవచ్చని తెలిపారు. ఇ-వాలెంట్(స్క్రిల్) ద్వారా వీసా లేదా మాస్టర్ కార్డులను(డెబిట్ లేదా క్రెడిట్ కార్డు) ఉపయోగించి ఆన్‌లైన్‌లో వీసా రుసుము చెల్లించాల్సి వుంటుందని థామస్ తెలిపారు. ఇది వీసా వ్యవహారాల నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుందని, ఫలితంగా వీసా ఫీజులు కూడా తగ్గటానికి తోడ్పడుతుందని వివరించారు. దరఖాస్తు చేయటానికి కొద్ది రోజుల ముందే ఇ-వాలెట్ ఖాతాను సృష్టించుకోవాల్సి వుంటుందని వెల్లడించారు.

# ఏకపక్షంగా రాష్ట్ర విభజన తగదు

## "లోక్‌సత్తా" జిల్లా అధ్యక్షులు మక్కెన

నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి, రామలింగాపురం, మినీబైపాస్ రోడ్డు కూడలిలో లోక్‌సత్తా పార్టీ ఈనెల 7న రాష్ట్ర విభజనపై ప్రజా బ్యాలెట్ సేకరణను నిర్వహించింది. ఈసందర్భంగా పార్టీ జిల్లా రాష్ట్ర అధ్యక్షులు మక్కెన అంకయ్య చౌదరి మాట్లాడుతూ సమైక్యస్ఫూర్తికి విరుద్ధంగా, దేశసమగ్రతను తూట్లుపొడిచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్ర విభజన ప్రక్రియను చేస్తుండడాన్ని లోక్‌సత్తా పార్టీ ఖండిస్తుందన్నారు. దీనిని ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ వ్యతిరేకించకపోతే దేశ భవిష్యతు ప్రమాదంలో పడేలా వుందని పేర్కొన్నారు. ప్రజాబ్యాలెట్ సేకరణ కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేసారని, ప్రజాభిప్రాయం మేరకు అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి సామరస్య పూర్వకంగా పరిష్కారం కనుగొనేలా వివిధ వేదికలకై ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా బాధ్యులు ఎస్‌డి రసూల్, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లురెడ్డి, ఎన్.నర్సయ్య పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# కల్యాణ వైభోగం...!



మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమరాలు, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి కుమార్తె **ఆశ్రిత - విశాల్** (కావలి విశ్వోదయ విద్యాసంస్థల అధినేత దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి కుమారుడు)ల కల్యాణం ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



వైకాపా స్టీరింగ్ కమిటీ జిల్లా సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మేనకోడలు, దువ్వూరు సాయిభాస్కర్‌రెడ్డి కుమార్తె **మౌనిక - శివచరణ్‌రెడ్డి**ల పరిణయం ఈ నెల 11వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభాభినందనలు.




నెల్లూరు వాస్తవ్యులు అరిగెల సుధాకరరావు - రాజేశ్వరిల కుమార్తె **సాయి అర్చన - కీర్తి నారాయణ**ల పెళ్ళి ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

## బాలసదన్‌కు సీలింగ్‌ఫ్యాన్లు వితరణ



వాసవిక్లబ్ మరియు వనిత క్లబ్ వారు సంయుక్త సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 11వతేదీన నెల్లూరులోని బాలసదన్ చిన్నపిల్లల ఆశ్రమానికి నాలుగు సీలింగ్‌ఫ్యాన్లు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సి. హెచ్. శరత్‌కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు ఉమారాణి, రాజు, మురళీకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


## గురవయ్యకు ప్రతిష్ఠాత్మక బిరుదు



నెల్లూరుజిల్లాలో ఎక్కడ శ్రీనివాసకల్యాణోత్సవాలు జరుగుతున్నా తన అన్నమాచార్య కీర్తనలతో భక్తులను భక్తి తన్మయత్వంతో ముంచెత్తే గుండాల గురవయ్యకు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య వంశస్తులు నిర్వహిస్తున్న శ్రీ వెంకట అన్నమాచార్య సేవాట్రస్ట్ వారు 'శ్రీహరి వేంకట అన్నమాచార్యులు' బిరుదును ప్రదానం చేయనున్నారు. ఈమేరకు ట్రస్ట్ నిర్వాహకులు తాళ్ళపాక హరినారాయణచార్యులు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రతిష్ఠాత్మకమైన బిరుదును పొందిన గుండాల గురవయ్యను నెల్లూరుజిల్లా ధార్మిక సలహామండలి సభ్యులు, భక్తులు అభినందిస్తున్నారు.

### 'మండే'గుండెల్లో వెన్నెల సూరీడు మండేలా

# నేలరాలిన నల్లకిరణం



స్వేచ్ఛగా ఉండటమంటే కేవలం మన సంకెళ్ళను మనం తెంచుకోవటంకాదు ఇతరుల స్వేచ్ఛను గౌరవిస్తూ దాన్ని పెంపొందించే విధంగా జీవించడం అంటారు మండేలా. 97ఏళ్ళ తన జీవితకాలంలో దాదాపు 3వవంతు సమయం జైలులోనే గడిపారు మండేలా. ఆయన కేవలం నల్లసూరీడు కాదు, వర్ణ వివక్షలో జాత్యహంకారాల్లో కూరుకు పోయిన ప్రపంచ మానవాళికి మానవత్వం, సమానత్వం నేర్పించాలని తన జీవితాన్నే అంకితం చేసిన ప్రజాస్వామ్య దీప్తి.

క్యూను గ్రామంలో 1918జూలై 18న మండేలా జన్మించాడు. మండేలాకు 10ఏళ్ళు వయస్సు వచ్చే సరికి తండ్రి చనిపోయాడు. సమీపబంధువుల ఇళ్ళలో పెరుగుతూ నల్లజాతి వీరుల పోరాట గాథలు వింటూ తమ ప్రజల మేలుకోసం ఏదైనా చేయాలన్న ఆలోచన మండేలా మదిలో మెదిలింది. 1944లో వివాహం చేసుకున్నారు. 1948నాటికి ఏఎన్‌సి యూత్ లీగ్‌లో ప్రముఖ నేతగా ఎదిగారు. 1952లో ఏఎన్‌సీ జాతీయ ఉపాధ్యక్షుడిగా మండేలా ఎన్నికయ్యారు. కమ్యూనిజం వ్యాప్తికి తోడ్పడుతున్నారన్న ఆరోపణలపై మండేలా సహా 22మంది నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. జైలు శిక్ష విధించింది. 1955జూన్ 26న జోహెన్నెస్‌బర్గ్‌లో జరిగిన మహాసభకు వేలాదిమంది హాజరై మండేలా తయారు చేసిన హక్కుల పత్రాన్ని (దక్షిణ చార్టర్) ఆమోదించారు. ఆగ్రహించిన ప్రభుత్వం మండేలాతో పాటు 156మంది నేతలపై కుట్రకేసు మోపింది. ఇతర వర్ణాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలతోనూ సాన్నిహిత్యంగా మెలగాలనే మండేలా వాదన 1958లో ఏఎన్‌సీలో చీలికకు దారి తీసింది. పాన్‌ఆఫ్రికన్ కాంగ్రెస్ ఏర్పాటైంది. కొత్త రాజ్యాంగం కోసం ఏఎన్‌సీ సమ్మెను ప్రభుత్వం అణచివేయడంతో ఏఎన్‌సీ కమ్యూనిస్టు పార్టీలు హింసాయుత పోరాటానికి నిర్ణయించాయి. మండేలా పలు ఆఫ్రికాదేశాల్లో రహస్యంగా పర్యటించి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. స్వదేశానికి తిరిగొచ్చి మారు వేషాల్లో తిరుగుతూ ఉద్యమ ప్రచారం చేపట్టారు. పోలీసులకు పట్టుబడడంతో కోర్టు ఐదేళ్ళు జైలుశిక్ష విధించింది. మరుసటి ఏడాది కొత్త అభియోగాలు మోపారు. మండేలా తదితరులకు యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. ఆ తర్వాత మండేలా దాదాపు 27ఏళ్ళపాటు రాబెన్ ఐలాండ్ జైలులో కటికనేలపై అరకొర ఆహారంతో దుర్భర జీవితాన్ని గడిపారు. మండేలా తన ఆత్మకథ "లాంగ్ వాక్‌టు ఫ్రీడమ్"లో జైలు నుంచి విడుదలైన క్షణాల గురించి ప్రస్తావిస్తూ ఆ గేటు నుంచి బయటకు వస్తున్నప్పుడు 71ఏళ్ళ వయసులో కూడా నాకు కొత్త జీవితం ప్రారంభిస్తున్నట్లుగా అనిపించిందని వ్యాఖ్యానించారు.

**భారత్ అంటే ప్రేమ:**

దక్షిణాఫ్రికా గాంధీగా పేరున్న మండేలాకు భారత్‌తో ప్రత్యేక అనుబంధం వుంది. గాంధీతో సారూప్యం వుంది. సుదీర్ఘ జైలు జీవితం అనంతరం 1990లో విడుదలైన మండేలా తన తొలి విదేశీ యాత్రకు భారత్‌నే ఎంచుకున్నారు. జైలు నుంచి విడుదలయిన వెంటనే ఆయనకు భారత్ అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న"ను ప్రకటించింది. నోబెల్ శాంతి పురస్కారంకంటే ముందే భారత్ ఆయనను భారతరత్నతో గౌరవించడం విశేషం. ఈ పురస్కారం పొందిన తొలి విదేశీయుడు ఆయనే. 2001లో అంతర్జాతీయ గాంధీ శాంతిపురస్కారం తోనూ ఆయన్ను భారత ప్రభుత్వం సత్కరించింది.

తాను గాంధేయుడననీ "సత్యం- అహింస"లే తనకు శిరోధార్యాలని మండేలా చెబుతుండేవారు. సత్యాగ్రహాన్ని ఒకతత్వంగా ఉద్యమ విధానంగా ఇక్కడే గాంధీజీ అభివృద్ధి చేశారని 1993లో దక్షిణాఫ్రికాలో గాంధీస్మారకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా మండేలా అన్నారు. గాంధీ అహింసా సిద్ధాంతంతోనే 1952లో దక్షిణాఫ్రికాలో చేపట్టిన ధిక్కారోద్యమం లక్షల మందిని కూడగట్టగలిగింది.

ఆ ఉద్యమంతోనే ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ విస్తృత ప్రజాసంస్థగా ఆవిష్కృతమయిందని మండేలా అన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత మండేలా పలుమార్లు భారత్ పర్యటనకు వచ్చారు. ఇక్కడి నేతలను దక్షిణాఫ్రికాకు ఆహ్వానించారు. ఆయన భారత్‌కు ఎప్పుడు వచ్చినా తన పర్యటనను మహాత్మా గాంధీ జన్మ భూమికి చేస్తున్న తీర్థయాత్రగా భావించే వారు. 1994 నుంచి 1999 మధ్య దక్షిణాఫ్రికా తొలి నల్లజాతి అధ్యక్షుడిగా మండేలా భారత్‌తో సన్నిహిత సంబంధాలు నెరిపారు.

సొంతగడ్డపై కనీస ఓటు హక్కును కూడా నోచుకోని నల్లజాతీయుల తరపున మండేలా సాగించిన పోరాటం అసమానం. శతాబ్దాల పాటు విద్వేషవిషం చిమ్మిన తెల్లపాలకుల ఏలుబడి నుంచి దక్షిణాఫ్రికాను విముక్తం చేసిన ఆయన తన జీవితకాలంలో మూడో వంతు సమయం జైలులోనే గడిపినా, కటకటాల వెనుక దుర్భర నరకం అనుభవించినా, మహాత్ముడి బాటలో అహింసనూ, అసమాన క్షమాగుణాన్ని ప్రదర్శించి దక్షిణాఫ్రికా గడ్డపైన జాతి దురంహంకారంపై అలుపెరగని పోరాటం సాగించి దిగ్విజయుడై చివరికి దేశాధ్యక్షుడై ప్రపంచవ్యాప్తంగా సరికొత్త ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిల్చారు. యావత్ ప్రపంచం నీరాజనాలు అందుకోవడమే కాదు ఈ ప్రపంచానికి సరికొత్త పాఠాలు కూడా నేర్పిన సూరీడు మండేలా 2013 డిసెంబర్ 6న అస్తమించారు. జోహార్ పోరాటయోధుడా!

### హాస్యానికే భాష్యం చెప్పిన...

# ధర్మవరపు సుబ్రహ్మణ్యం

నెల్లూరులోని మురళీ ఆర్ట్స్ కార్యాలయంలో ఈనెల 8న జోకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అకాల మరణం చెందిన ప్రముఖ సినీనటులు ధర్మవరపు సుబ్రహ్మణ్యం సంతాపసభను నిర్వహించారు. ధర్మవరపు ఛాయాచిత్రానికి పూలమాలలువేసి సభ్యులందరూ ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా టీ.వి నటుడు మురళీఆర్ట్స్ అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహనరావు మాట్లాడుతూ సహజమైన నటనతో బుల్లితెర ద్వారా పరిచయమై సినీరంగంలో హాస్యానికే భాష్యం చెప్పిన గొప్పనటులు ధర్మవరపు సుబ్రహ్మణ్యం అని పేర్కొన్నారు. ఆయన కేవలం నటుడేకాక, రచయితగా, దర్శకునిగా పనిచేసి రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షునిగా ఎదిగి కళాకారులకు ఇతోధిక సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి పాముల రమణయ్య, మల్లు రామయ్య, పత్తి నరసింహులు, పంట్రంగి వెంకటేశ్వర్లు, తోట సుబ్రహ్మణ్యం, విజయ్, రాచకొండ నాగరాజారావు, సుమన్, మిమిక్రీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# కళాఖండాలను జాలువార్చే కుంచె


సునీతా రవి

మహిళాలోకాన్ని బాగా ఆకట్టుకునే ఫ్యాబ్రిక్స్ పెయింటింగ్స్‌తో సాధన చేస్తూ, మంచి నైపుణ్యంతో రాణిస్తున్న చిత్రకారిణి సునీతారవి. ఆమె చిత్రంలో దేవతామూర్తులు ప్రత్యక్షమవుతారు. పల్లెభామలు పలుకరిస్తారు. కాదేది కళలకనర్హం అన్నట్లుగా ఆమె కుంచె నుండి జాలువారు ప్రతి బిందువు కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా చిత్రాలై దర్శనమిస్తాయి. సాదా చీరలపై కళారూపాలను మలచగలరు. చిన్నప్పుడు ఏవో పిచ్చి బొమ్మలే మంచి చిత్రకారిణిగా నిలబెట్టింది. ఆయా చిత్రాల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం తమ కుటుంబ అవసరాలకు చేదోడు వాదోడుగా నిలిచిందని అంటున్న ప్రముఖ చిత్రకారిణి కనుపర్తి సునీతారవి. తంజావూరు పెయింటింగ్ చేయడంలోనూ, ఆర్ట్ చిత్రాలు గీయడంలోను ప్రజ్ఞాశాలి ఆమె. నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు వద్ద కాపురముంటున్న కనుపర్తి రవి సతీమణి సునీత. చిన్నతనం గూడూరులో గడిచింది. విద్యార్థి దశ గూడూరులోనే వయస్సుతో పాటు తన కళాభిరుచిని పెంచుకున్నారు. 1989 వ సంవత్సరం ఇంటర్మీడియెట్ చదివే రోజుల్లో దువ్వూరు రమణమ్మ ఉమెన్స్ కాలేజీలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించిన సునీత ఆ తర్వాత వెనుతిరిగి చూడలేదు. అదే స్ఫూర్తితో అకుంఠిత దీక్షతో ఆమె ఎన్నో చిత్రాలకు జీవం పోసారు. క్లిష్టమైన చిత్రకళను అభ్యసించాలనే తపనతో ఆమె తంజావూరు చిత్రకళ, తంజావూరు గ్లాస్‌కళ, తంజావూరు గ్లాస్‌పై చిత్రకళను నేర్చుకునేందుకు చెన్నైలో కొంతకాలం శిక్షణ పొంది, చిత్రకళల్లో మెళకువలను బెంగుళూరులో అభ్యసించారు. ఇంత వరకు ఆమె తంజావూరు, ఎంబోజింగ్ కుడ్య చిత్రాలు, నిబ్ పెయింటింగ్, క్యాన్వాస్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఇతిహాసం, చారిత్రకం, సామాజిక అంశాలపై దాదాపు వందల సంఖ్యలో చిత్రాలు వేశారు. ఆమె వేసిన ప్రతి చిత్రాన్ని బెంగుళూరు, హైదరాబాద్ తదితర నగరాల నుండి వచ్చిన కళాభిమానులు కొనుగోలు చేస్తారు. బంగారంతో విలువైన రాళ్ళతో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి చిత్రానికి తంజావూరు చిత్రకళతో రూపుదిద్దారు. శారీస్‌పై రంగుల చిత్రాలు దిద్దే శిక్షణ కేంద్రాన్ని తన ఇంటి వద్దనే సునీత నిర్వహిస్తున్నారు. చీరలపై అందంగా డిజైన్ చేయడంతో పాటు, క్రాఫ్టులలో వివిధ రకాల బొమ్మలను అందంగా తయారు చేయడంలో దిట్ట. ఎంతో కష్టసాధ్యమైన తంజావూరు పెయింటింగ్స్‌ను మొదటి నుంచి చివరి దాకా 22 క్యారెట్ల బంగారు రేకులను మలచడం, అందమైన రాళ్ళను పొదగడం వంటి అన్ని హంగులతో చిత్రాన్ని రూపుదిద్దడంతో సునీతది ప్రత్యేకశైలి. వినాయకుడు, బాలకృష్ణుడు, లక్ష్మీదేవి ఈ కోవకు చెందినవే. అంతే కాకుండా తంజావూరు గ్లాస్ పెయింటింగ్‌లో ఎన్నో మనోహరమైన చిత్రాలు, ఆర్ట్‌లో దాదాపు వందకుపైగా చిత్రాలు ఆమె కుంచె నుండి జాలువారి చూపరులను ఆకట్టుకుంటాయి. గిరిజన మహిళ, చిన్నికృష్ణుడు, షిరిడీసాయిబాబా, నిరీక్షణ ఈ కోవలోకి వస్తాయి. రాష్ట్రస్థాయిల్లో నిర్వహించిన ఎన్నో పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులనందుకున్నారు. చిత్రలేఖన పోటీల్లో ఎన్నో ఎన్నెన్నో మెమెంటోలు సాధించారు. ఆమె తీర్చిదిద్దిన చిత్రపటాలను గతంలో నెల్లూరు కలెక్టర్‌గా పని చేసిన యం.రవిచంద్ర తదితర అధికారులకు బహూకరించి ప్రశంసలు అందుకున్నారు.

ప్రతి మహిళ కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా తీరిక సమయాల్లో టీవీలు చూడడం కంటే చిత్రకళ లేక మరేదైనా లలితకళారంగాన్ని ఎంచుకుంటే మానసిక ఉల్లాసం కలుగుతుందని, మనసుంటే మహిళలకు ఎన్నో మార్గాలున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుంటే మహిళలు తమ జీవితాలను సుఖ సంతోషాలతో వెలుగొందుతాయంటున్న సునీతారవి భవిష్యత్తులో ఉత్తమ కళాకారిణిగా రాణించాలని ఆశిద్దాం.



# సోలో అయితేనే!



తెలుగు, తమిళ సినిమాలలో ఛాన్సులు తగ్గడంతో మలయాళ, కన్నడ భాషలపై దృష్టిపెట్టిన శ్రియకు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది. తాను హీరోయిన్‌గా నటిస్తున్న ఓ మలయాళ చిత్రంలో తనతో పాటు సెకండ్ హీరోయిన్‌గా ఆండ్రియాను తీసుకోవడంతో శ్రియకు కోపం వచ్చిందట. ఆ దెబ్బతో ఇక తాను సోలో హీరోయిన్‌గా తప్ప వేరో హీరోయిన్స్ వుంటే నటించనని చెప్పేసిందట! ఇలాగైతే అక్కడా శ్రియకు కష్టకాలమే!

## మూ'వీ'క్షణం



### జూ॥ ప్రిన్స్ అదుర్స్

ప్రస్తుతం ప్రిన్స్ మహేష్‌బాబు నటిస్తున్న '1' చిత్రంలో ఆయన కొడుకు గౌతం నటిస్తుండడం తెలిసిందే! ఈ మధ్యే తన పాత్రకు డబ్బింగ్ చెప్పిన గౌతమ్‌కృష్ణ లిప్ మూవ్‌మెంట్ ఎక్కడా మిస్‌కాకుండా డబ్బింగ్ పూర్తి చేసాడట! దీంతో యూనిట్‌లో వున్న వారంతా గౌతమ్ పిల్లాడు కాదు పిడుగు అని చెబుతుంటే మహేష్ ఆనందానికి అవధులే లేవంట. '1'లో గౌతమ్‌కృష్ణ చిన్ననాటి మహేష్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ నెల 19న ఈ చిత్ర ఆడియో విడుదల కానుంది.

### చెమటోడుస్తున్న బ్రదర్స్



ఈమధ్య టాలీవుడ్ హీరోలు చాలా మంది సిక్స్‌ప్యాక్‌బాడీలపై దృష్టి పెడుతుండడంతో, ఆ విషయంలో తాము ఎక్కడ వెనుకబడిపోతామోనని అక్కినేని బ్రదర్స్ కూడా తమ ఫిట్‌నెస్‌ను పెంచుకునేందుకు రోజు జిమ్‌లో చెమటోడుస్తున్నారట! 'మనం' సినిమాలో అఖిల్, నాగచైతన్య కనిపించబోతున్న విషయం తెలిసిందే! ఈ చిత్రంలో మరింత ఫిట్‌నెస్‌గా కనిపించాలన్న ఉద్దేశ్యంతో ఫిట్‌నెస్ ట్రైనర్ చంద్రశేఖర్ నేతృత్వంలో శ్రమపడుతున్నారు ఈ బ్రదర్స్!

# గూడూరు డివిజన్ వార్తలు

## విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు


భగవద్గీత శ్లోకాలను అప్పచెబుతున్న విద్యార్థిని

విద్యార్థులకు చిన్నతనం నుంచే చదువుతో పాటు మంచి సంస్కారాన్ని నేర్పి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకే ప్రతి సంవత్సరం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల కన్వీనర్ మల్లెమాల మురళీరెడ్డి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అళఘనాథస్వామి ఆలయంలో భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, పురాణాలు, ఇతిహాసాలు, గురించి తెలియచేసేందుకు వీ.హెచ్.పీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రతి ఏటా జరిగే భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. విజేతలకు ఈనెల 15వతేదీన నెల్లూరులోని మీనాక్షి కళ్యాణమండపంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, రుద్రరాజు కృష్ణంరాజు, పయ్యావుల మురళీనాయుడు, వెంకటరమణారెడ్డి, రవిచంద్రారెడ్డి, శ్రీనివాసులు, రాజారెడ్డి, సుబ్బరాములు, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, శేగు వెంకటలక్ష్మీప్రసాద్, శ్రీనివాసులునాయుడు, వెంకటరత్నంరాజు పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు, పుల్లయ్య పార్థసారథి, పద్మావతమ్మ, పద్మప్రియ, జ్యోతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## ఓటు ప్రాధాన్యాన్ని వివరించాలి

18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు ప్రాధాన్యాన్ని వివరించాల్సిన అవసరం ఉందని గూడూరు తహశీల్దార్ మైత్రేయ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఓటు అవగాహన ప్రచారరథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతగల యువత అంతా ఖచ్చితంగా ఓటు నమోదు దరఖాస్తు చేసుకొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీకారమే ప్రాణాలు తీసింది


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కె.చౌడేశ్వరి

గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలం తొణుకుమాల రెవెన్యూ పరిధిలోని నక్కావారి కండ్రిగ ప్రాంతంలో భూవివాద ప్రతీకారమే జంట హత్యలకు పురిగొల్పింది. మనస్సులో బలంగా నాటుకుపోయిన కక్ష రెండు నిండు ప్రాణాలను బలిగొంది. గతనెల 29వతేదీన ఇద్దరు మహిళలు దారుణహత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను 7వ తేదీ సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కె.చౌడేశ్వరి, రూరల్ సిఐ వేమారెడ్డి వివరాలను వెల్లడించారు. వారి వివరాల ప్రకారం కోట మండలం సిద్దమ్మ కండ్రిగ ప్రాంతానికి చెందిన బెల్లంకొండ వెంకటమ్మ, ఆమె స్నేహితురాలు మల్లి చెంచమ్మలు పొలంలో పనులు చేసుకుంటుండగా అక్కడే మాటువేసిన బెల్లంకొండ రవి(వెంకటమ్మ మరిది) వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, వెంకటమ్మ, సోమమ్మ వారిని హతమార్చేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలోనే కండువాలో రాయిని చుట్టి తొలుత దాడికి పాల్పడి అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారన్నారు. వెంకటమ్మ తండ్రి అంకయ్య తీవ్రంగా గాయపడి కోలుకుంటున్నారు. కేసులో నిందితులైన ఐదుగురిని ఆదివారం అరెస్టుచేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ చౌడేశ్వరీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవచూపిన చిల్లకూరు ఎస్సై దశరథరామారావు, ఐడీ పార్టీ సిబ్బంది స్టేషన్ సిబ్బంది షాహిద్, నరేంద్రకుమార్, వెంకటేశ్వర్లు, రవికుమార్‌లను అభినందించారు.

## దేశమంతా మోడీ ప్రభంజనం

దేశమంతా నరేంద్రమోడీ ప్రభంజనం వీస్తుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లూరు చెంచురెడ్డి అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయఢంకా మోగించడంతో పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 5 రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో పార్టీ అభ్యర్థులు గెలవడం మోడీ ప్రభంజనమేనన్నారు. 2014లో జరగబోయే ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో బిజేపీ అత్యధిక సీట్లు గెలిచి మోడీ ప్రధానమంత్రికావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మోసీష్, పొన్నుస్వామి, నాగేశ్వరరావు, మనోహర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ ముందస్తు వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వసంతరావు

గూడూరు పట్టణంలోని చర్చి వీధిలో ఉన్న లూథరన్ చర్చిలో సోమవారం ప్రీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన ఆంధ్రా క్రిస్టియన్ థియోలాజికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥వసంతరావు మాట్లాడుతూ దైవసందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. మానవాళి రక్షణకోసం క్రీస్తు తన రక్తాన్ని చిందించారన్నారు. క్రిస్మస్ పండుగరోజున నిర్వహించాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలిచ్చారు. నెల్లూరు, చిత్తూరు, కడప, చెన్నై ప్రాంతాలకు చెందిన పాస్టర్లు సమావేశంలో పాల్గొన్నారు. ప్రార్థనా మందిరాల ప్రతినిధులు అరుణోదయకుమార్, బత్తిని విజయకుమార్, డేవిడ్, మోసెస్, సుధాకర్, దయాకర్, ప్రేమ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# మైనార్టీలకు ఈసారి సీటు లేనట్లే..?

నెల్లూరు జిల్లాలో మైనార్టీల శాతం ఒక మోస్తరుగా వున్నప్పటికీ ఇంతవరకు ప్రధానపార్టీల తరఫున వారికి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. ప్రతి ఎన్నికలలోనూ మైనార్టీలకు సీట్లు ఇవ్వాలని వాళ్లు డిమాండ్ చేయడం, ప్రధానపార్టీలు మొండిచేయి చూపడం సర్వసాధారణం అయ్యింది. ఓట్ల పరంగా కొన్ని నియోజకవర్గాల్లో మైనార్టీల శాతం బాగానే ఉన్నప్పటికీ సీటిస్తే గెలుస్తారనే గ్యారంటీ లేకపోవడంతో అన్ని పార్టీలు కూడా సీట్ల వద్దకొచ్చేసరికి వారిని దూరంగా పెడుతున్నాయి. ముస్లింలకు అధిక ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్‌పార్టీ సైతం ఈ విషయంలో మైనార్టీలను చిన్నచూపే చూస్తుంది. ఎన్నోసార్లు ముస్లింల సంఖ్య ఎక్కువగా వున్న నెల్లూరు అసెంబ్లీ సీటును వాళ్లు కోరినా దక్కలేదు. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫునైనా తమ కోర్కెను నెరవేర్చుకోవాలని మైనార్టీలు కలగన్నారు. నెల్లూరు నగరం సీటు లక్ష్యంతో ఓ ముస్లిం నాయకుడు గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈ నాయకుడు తనకు సీటిప్పిస్తాడనిచెప్పి ఎంపి మేకపాటి రాజ మోహన్‌రెడ్డి మీద కొండంత ఆశ పెట్టుకుని వుండినాడు. అయితే తనను నమ్మి ముందుగానే పార్టీలోకి వచ్చిన అనిల్‌కుమార్ యాదవ్‌కు జగన్మోహన్‌రెడ్డి ఈ సీటును ఖరారు చేయడంతో వారి ఆశలపై నీళ్ళు చల్లినట్లైంది. ఇటీవల నెల్లూరుకు చెందిన కొందరు ముస్లింలు మేకపాటి గౌతమ్‌రెడ్డిని కలవగా ఆయన కూడా నెల్లూరుసీటు అనిల్ కుమార్‌కు ఖరారైందని, ఆయన గెలుపు కోసం కృషిచేయండని చెప్పడంతో వీళ్ళ ఆశలు పూర్తిగా నీరుగారాయి. ప్రస్తుతాని కైతే జిల్లాలోని 10అసెంబ్లీ సీట్లలో ఎక్కడా మైనార్టీలకు అవకాశం లేనట్లే! జగన్ పార్టీ పెట్టినప్పుడే అందులో చేరి పనిచేసి వుంటే ఒక్కరికన్నా అవకాశం ఉండేదేమో?




# రాష్ట్రం విడిపోతే సీమాంధ్ర ఎడారే!

## కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రాష్ట్రం విడిపోతే సీమాంధ్రలోని ప్రాజెక్టులకు చుక్కనీరు రాదని, తీవ్రంగా నష్టపోయేది రైతులేనని వైయస్సార్‌సీపీ సిజిసి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన సమైక్య ఉద్యమంలో భాగంగా బుధవారం నెల్లూరుజిల్లా పొదలకూరు పట్టణంలోని సంగంరోడ్డు సెంటర్ నుంచి రామ్‌నగర్ గేట్ సెంటర్ వరకు 100ట్రాక్టర్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కాకాణి మాట్లాడుతూ విభజన జరిగితే జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు ఎడారిలా మారుతాయన్నారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పు సీమాంధ్ర రైతులకు గొడ్డలిపెట్టన్నారు. వైయస్సార్ శ్రీశైలం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వెడల్పు పెంచడం వల్ల సోమశిలకు 22వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రాష్ట్రంలోని మూడుప్రాంతాల వారు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పోరాటం చేస్తోందన్నారు. కాంగ్రెస్‌పార్టీ చచ్చిపోయిందంటూ ఆ పార్టీ సీనియర్ నాయకులు జేసి దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబునాయుడు విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చి డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గోగిరెడ్డి గోపాలరెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, పొదలకూరు సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.




## జేసీ లక్ష్మీకాంతంకు...

# రాష్ట్రస్థాయి కమిటీలో చోటు



ప్రభుత్వ భూమి, ఈ-పాసుపుస్తకాలు, చుక్కలభూమి వంటి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలువురు కలెక్టర్లు, జేసీలతో కమిటీ నియమించింది. ఈ కమిటీలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతంకు చోటు కల్పించారు.

# రత్నం విద్యార్థినులకు బంగారు పతకాలు



రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో డాక్టర్ కిషోర్స్‌రత్నం విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్‌రత్నం స్కూల్‌లో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.కృష్ణకిషోర్ మాట్లాడుతూ ఈనెల 5 నుండి 7వతేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 59వ రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ యోగాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు కె.జోషిత, కె.ఉమ, ఎం.దివ్యమాలిక అండర్-17 టీం ఈవెంట్‌లో బంగారు పతకాలు సాధించారన్నారు. ఆసనాల విభాగంలో జోషిత అండర్-17 విభాగంలో బంగారు పతకం, అండర్-14 ఆసనాల టీం ఈవెంట్ విభాగంలో వై.జోష్ణవి రెండు బంగారుపతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన నలుగురు విద్యార్థినులు జాతీయస్థాయిలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ వాసంతి కృష్ణకిషోర్ జనరల్‌మేనేజర్ రామూర్తినాయుడు పాల్గొని యోగా గురువు ముప్పిరాల నరశింహశాస్త్రిని అభినందించారు.

# నేత్రదానం



మాజీ న్యాయమూర్తి స్వర్గీయ పాణెం పార్థసారథి సతీమణి శ్రీమతి లీలావతమ్మ ఈ నెల 5వ తేదీన కన్నుమూసారు. ఆమె అల్లుడు లయన్స్‌క్లబ్ సభ్యులు, ప్రముఖ ఫోటోగ్రాఫర్ మోహన్‌రాజ్ చొరవతో నెల్లూరులోని మోడరన్ ఆసుపత్రి వారు ఆమె రెండు నేత్రాలను సేకరించారు. తాను మరణించినా, తన కళ్ళతో ఇరువురికి వెలుగు ప్రసాదించిన లీలావతమ్మ పుణ్యజీవి, ధన్యజీవి.




Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.